



# విజయభాను





విశాఖపట్నం, ఆదివారం 09-01-2022 | VIJAYABHANU DAILY ⁎ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 96 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# 5 రాష్ట్రాలకు మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా..

## ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7 వరకు మొత్తం 7 దశల్లో పోలింగ్

## మార్చి 10న ఫలితాలు





దిల్లీ : ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఉత్తరప్రదేశ్ సహా ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం నేడు షెడ్యూల్‌ను ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం విజ్ఞాన్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ) సుశీల్ చంద్ర.. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 690 శాసనసభ నియోజకవర్గాలకు మొత్తం 7 దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7 వరకు ఏడు విడతల్లో పోలింగ్ జరపనున్నట్లు సీఈసీ తెలిపారు. మార్చి 10న కౌటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నట్లు చెప్పారు.

**యూపీలో 7 విడతల్లో.. మణిపూర్‌లో 2 దశల్లో**

ఉత్తరప్రదేశ్‌కు మొత్తం 7 దశల్లో ఎన్నికలు జరగనుండగా.. పంజాబ్, ఉత్తరాఖండ్, గోవాకు ఫిబ్రవరి 14న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఇక మణిపూర్ రాష్ట్రానికి ఫిబ్రవరి 27, మార్చి 3న రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఫిబ్రవరి 10న తొలి విడత పోలింగ్ జరగ నుండగా.. మార్చి 7న చివరి దశ ఓటింగ్ నిర్వహించనున్నారు.

ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, మణిపూర్ శాసనసభల గడువు మార్చితో ముగియనుండగా.. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ గడువు మే నెలతో పూర్తవుతుంది. యూపీలో 403 శాసనసభ నియోజకవర్గాలుండగా.. ఉత్తరాఖండ్‌లో 70, పంజాబ్‌లో 117, గోవాలో 40, మణిపూర్‌లో 60 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరగనుంది. నేటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఈసీ తెలిపింది.

**పోలింగ్ సమయం గంట పెంపు..**

ఈ సందర్భంగా సీఈసీ సుశీల్ చంద్ర మాట్లాడుతూ.. "కరోనా ఉద్ధృతి వేళ ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలే. దీనిపై ప్రభుత్వంతో పాటు నిపుణులతోనూ చర్చించాం. కొవిడ్ రహిత పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లతో పాటు సిబ్బందిని రక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని చెప్పారు.

ఈ ఎన్నికల్లో మొత్తం 18.34కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు సీఈసీ తెలిపారు. ఇందులో 8.55కోట్ల మంది మహిళా ఓటర్లు, 24.9లక్షల మంది తొలి ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. కరోనా నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను 16శాతం పెంచినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సమయాన్ని కూడా గంట పెంచుతున్నట్లు తెలిపారు. ఇక పోలింగ్ విధుల్లో పాల్గొనేవారికి ఫ్రంట్‌లైన్ వర్కర్లుగా పరిగణించి.. వారికి కూడా ప్రికాషనరీ డోసు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

**ఆన్‌లైన్ నామినేషన్లకు అవకాశం..**

మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో ఈ సారి ఆన్‌లైన్ నామినేషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు సీఈసీ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ నామినేషన్లను దాఖలు చేయొచ్చని తెలిపారు. దీని వల్ల రద్దీ తరువాయి 2లో..

# 10 నుంచి వైకుంఠ ద్వార సర్వదర్శన టోకెన్లు జారీ

## తితిదే అదనపు ఈవో ధర్మారెడ్డి



తిరుపతి (విజయభాను న్యూస్) : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీ నుంచి వైకుంఠ ద్వార సర్వదర్శన టికెట్లను జారీ చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అదనపు ఈవో ధర్మారెడ్డి తెలిపారు. కరోనా దృష్ట్యా తిరుపతి వాసులకే సర్వదర్శన టోకెన్లను జారీ చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం తిరుపతిలో 5 చోట్ల సర్వదర్శన టోకెన్ల జారీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ధర్మారెడ్డి పేర్కొన్నారు. టోకెన్ల జారీ కేంద్రాలను శనివారం ధర్మారెడ్డి పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. "వైకుంఠ ద్వార దర్శనం కోసం జనవరి 10న ఉదయం 9 గంటలకు తిరుపతిలో సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తాం. తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి, ముత్యాలరెడ్డిపల్లె, సత్యనారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలు, బైరాగి పట్టెడ రామానాయుడు పాఠశాల, మున్సిపల్ కార్యాలయంలో టికెట్ల జారీకి కౌంటర్లను ఏర్పాటు చేశాం.

వైకుంఠ ద్వార దర్శనానికి స్థానికులకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు రోజుకు 5 వేల చొప్పున 50 వేల సర్వదర్శనం టికెట్లు జారీ చేస్తాం.

టికెట్ల కోసం వచ్చే భక్తులు క్యూలో కొవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. టికెట్లు పొందిన భక్తులను ముందురోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి అలిపిరి మార్గం నుంచి తిరుమలకు అనుమతిస్తాం"ధర్మారెడ్డి తెలిపారు.

# ఏపీ ప్రభుత్వ ఓటీఎస్ విధానం మంచిదే

## : సీపీఐ నారాయణ



తిరుపతి: పంజాబ్ రైతుల నిరసనపై ప్రధాని మోదీ కొత్త నాటకానికి తెరతీశారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. తనను హత్య చేసేందుకు ప్రయత్నం జరిగిందని నరేంద్ర మోదీ సానుభూతి కోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నటనలో నేచురల్ స్టార్ నానిని నరేంద్ర మోదీ మించిపోయారన్నారు. 'చైనా దురాక్రమణ పై ఇప్పటి ఇరకు కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. కాంగ్రెస్లో అంతర్గత లోటుపాట్లు సరిదిద్దుకోకపోతే ఆపార్టీకి భవిష్యత్తు ఉండదు. తెలంగాణలో బీజేపీ నేతల అరెస్టు ద్వారా ఆ పార్టీని కేసీఆర్ మరింత బలోపేతం చేస్తున్నారు. అధికార పార్టీ చర్యలు తోనే తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తోంది. జనసేన పొత్తులపై చంద్రబాబు చేసిన రాజకీయ చంచలత్వానికి నిదర్శనం. పొత్తులపై చంద్రబాబుకు క్లారిటీ లేకపోతే టీడీపీ వచ్చే ఎన్నికల్లోనూ ఇబ్బందులు తప్పవు. టీడీపీతో బీజేపీ పొత్తు ఉంటే మా నిర్ణయం మేము తీసుకుంటాము.

ఏపీ ప్రభుత్వ ఓటీఎస్ విధానం మంచిదే.. ఇళ్లకు రేటు పెరుగుతుంది. సీఎం జగన్ సంక్షేమ పథకాల అమలు బాగుంది' అని నారాయణ పేర్కొన్నారు.

# ఎస్సీలపై దాడులు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది... చంద్రబాబు



కుప్పం: రాష్ట్రంలో ఎస్సీలపై దాడులు చూస్తుంటే ఆందోళన కలుగుతోందని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. ఎస్సీలను చంపేసుకుంటూ పోతే అడిగేవారు లేరనుకున్నారా అని ప్రశ్నించారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన ఇవాళ కుప్పంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. "వేధింపులు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒక ఎస్సీ మాస్కు పెట్టుకోలేదని కొట్టి చంపారు. ముఖ్యమంత్రి మాత్రం మాస్కు పెట్టుకోరు. ఎస్సీ, ఎస్టీలను అవమానిస్తే చూస్తూ ఊరుకోము. వారి మనోభావాలు దెబ్బతీస్తే సహించేది లేదు. రాజ్యాంగ హక్కులు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు.

# రైళ్లలో ప్రయాణించాలంటే.. టీకా సర్టిఫికెట్ తప్పనిసరి

చెన్నై: తమిళనాడులో కరోనా మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో దక్షిణ రైల్వే కీలక ఆదేశాలు జారీ చేసింది. కరోనా టీకా రెండు డోసులు తీసుకున్నవారికి మాత్రమే చెన్నై లోకల్ రైళ్లలో ప్రయాణించేందుకు అనుమతిస్తామని వెల్లడించింది. కౌంటర్? వద్ద కొవిడ్ వ్యాక్సినేషన్? సర్టిఫికెట్ చూపించినవారికే టికెట్? అందిస్తామని అధికారులు ఈ మేరకు స్పష్టం చేశారు. జనవరి 10 నుంచి 31వ తేదీ వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఒమిక్రాన్ కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అంతేకాక దక్షిణ జోన్?లోని రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో మాస్కు లేకుండా కనిపిస్తే రూ. 500 జరిమానా విధిస్తామని రైల్వే జోన్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రయాణికులు కొవిడ్ నిబంధనలను తప్పక పాటించాలని సూచించింది. కరోనా తరువాయి 2లో..

# ఒమిక్రాన్‌ను తేలిగ్గా తీసుకుంటే

## తీవ్ర పరిణామాలే.. హెచ్చరించిన (డబ్ల్యూహెచ్ఓ)




జెనీవా: ఆగ్నేయాసియాలో కరోనా వైరస్ శరవేగంగా వ్యాప్తిచెందుతున్న క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక సూచనలు చేసింది. క్షేత్రస్థాయిలో కొవిడ్ ఆంక్షలను కఠినంగా అమలు చేయాలని పేర్కొంది. ఒమిక్రాన్ అంత ప్రమాదకరమైనది కాదని నిపుణులు చెబుతున్నా.. అప్రమత్తత అవసరమని స్పష్టం చేసింది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అన్నిరకాలుగా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టాలని డబ్ల్యూహెచ్ ఓ రీజినల్? డైరెక్టర్ డాక్టర్? పూనమ్? ఖేత్రపాల్ సింగ్? తెలిపారు. ఒమిక్రాన్‌ను తేలిగ్గా తీసుకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 'కరోనా ఇంకా వ్యాప్తిచెందకుండా అధికార యంత్రాంగాలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎక్కడికక్కడ కఠిన నిబంధనలను అమలు చేయాలి. మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వెంటిలేషన్?, భౌతిక దూరం తదితర నియమాలను కచ్చితంగా పాటించాల్సిందే' అని ఖేత్రపాల్‌సింగ్ సూచించారు. విస్తరిస్తున్న వాటిలో ఒమిక్రాన్ కేసులు మాత్రమే కాకుండా.. అత్యంత ప్రమాదకరమైన డెల్టా సహా ఇతర వేరియంట్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఒమిక్రాన్ ప్రభావం తీవ్రంగా ఉండదని పలు నిపుణులు చెబుతున్నప్పటికీ.. నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. కొత్త వేరియంట్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య వ్యవస్థలపై ప్రభావం చూపుతోందని తెలిపారు. ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతరుల ప్రాణాలను కాపాడాలంటే ఆరోగ్య వ్యవస్థలపై భారం పడకుండా నివారించాలన్నారు. టీకా తీసుకున్నప్పటికీ కొవిడ్ నిబంధనలు పాటించాలని.. మాస్కులు, భౌతిక దూరం పాటించాల్సిందేనని హెచ్చరించారు. ఒమిక్రాన్ వేరియంట్‌తో ఇన్‌ఫెక్షన్ తీవ్రత తక్కువగానే ఉండొచ్చనే వార్తలు ప్రస్తుతానికి ఊరటనిచ్చే అంశమే. అయితే పరిణామక్రమం పరంగా జరిగిన 'పొరపాటు' వల్లే ఇది తేలికపాటి వైరస్‌గా ఉందని, తదుపరి వేరియంట్ మరింత ప్రమాదకరంగా మారొచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయని భారత సంతతికి చెందిన పరిశోధకుడు రవీంద్ర గుప్తా తెలిపారు.

## విజయవాడలో ఒకే కుటుంబానికి చెందిన

# నలుగురి ఆత్మహత్య



విజయవాడ: విజయవాడలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణలోని నిజామాబాద్ నుంచి పప్పుల సురేష్ కుటుంబం ఈ నెల దుర్గమ్మ దర్శనానికి విజయవాడకు వచ్చారు. నగరంలోని వన్‌టౌన్‌లో ఉన్న కన్యకాపరమేశ్వరి సత్రంలో పప్పుల అఖిల్ పేరుతో కుటుంబం రూమ్‌ను అద్దెకు తీసుకున్నారు. ఈ తెల్లవారుజామున 2.30గంటల సమయంలో అప్పుల బాధతో చనిపోతున్నట్లు బంధువుకు మెసేజ్ పెట్టారు. అతను స్పందించి సత్రం నిర్వహకులకు ఫోన్ చేశాడు. సత్రం సిబ్బంది, నిర్వాహకులు ఈ కుటుంబం ఉన్న రూమ్‌కు వెళ్లి చూడగా తల్లి, కుమారుడు విగతజీవులుగా కనిపించారు. ఆ గదిలో కొన్ని మందులను గుర్తించారు. తండ్రి, మరో కుమారుడు కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనంతరం పోలీసులకు సమాచారం అందింది. మృతులను పప్పుల సురేష్(56), పప్పుల శ్రీలత(54), పప్పుల అఖిల్(28), పప్పుల ఆశిష్(22)గా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




# గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీలకు దరఖాస్తు చేసుకోండి

## - హెచ్‌పిసిఎల్ (వి ఆర్)




గాజువాక : (విజయభాను న్యూస్) : హెచ్ పి సి ఎల్ విశాఖ రిఫైనరీ వివిధ ఇంజనీరింగ్ విభాగాల నుండి 100 మంది గ్రాడ్యుయేట్ అపరేంటిస్ ట్రైనీలకోసం తీసుకొనున్నట్లు, అందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హెచ్ పి సి ఎల్ విశాఖ రిఫైనరీ యాజమాన్యం ఒక ప్రకటన ద్వారా కోరింది. విశాఖ రిఫైనరీ వివిధ ఇంజనీరింగ్ విభాగాల నుండి 100 మంది గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీలను నెలకు రూ. 25000, స్టైఫండ్ తో 1 సంవత్సరం పాటు తీసుకుంటున్నారు. అర్హత ప్రమాణాలు, దరఖాస్తు పద్ధతులకు సంబంధించిన వివరణాత్మక ప్రకటన నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్ లో ప్రచురించబడింది. నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్ లో శుక్రవారం 100 మంది గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీల కోసం విడుదల చేసిన కొత్త ప్రకటనలో, హెచ్ పీసీల్ - విశాఖ రిఫైనరీ మెకానికల్,కెమికల్,ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్,కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, ఐటీ,సివిల్, ఇన్స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ మొదలైన విభాగాలతో పాటు ఆర్కిటెక్చర్, ఫుడ్ టెక్నాలజీ, పెట్రోలియం ఇంజినీరింగ్,ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్,ఎన్విరాన్మెంట్ పొల్యూషన్, కంట్రోల్ ఇంజినీరింగ్, ఎనర్జీ ఇంజినీరింగ్,ఇంటీరియర్ డెకరేషన్ మొదలైన వివిధ స్పెషలైజేషన్ విభాగాల విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించింది. హెచ్ పీసీల్ - విశాఖ్ రిఫైనరీ ఈ 28 నేపథ్యాల నుండి అభ్యర్థులకు పారిశ్రామిక బహిర్గతం అందించడానికి ప్రయత్నిస్తుంది.

ఆసక్తి ఉన్న విద్యార్థులు నేషనల్ అపెంటిషిప్ ట్రైనింగ్ స్కీమ్ (నాట్స్ ) పోర్టల్ లో అందుబాటులో ఉన్న లింక్ పై నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థించారు. దరఖాస్తు చివరి తేదీ ఈనెల 14వ తేదీన గా యాజమాన్యం తెలిపింది.

# శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాల నందు ఘనంగా సంక్రాంతి సంబరాలు



అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం స్థానిక శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాల నందు శనివారం ఉదయం 8.00 గంటల నుండి సంక్రాంతి ఉత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముందుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర. త్రినాధరావు మరియు కళాశాల ప్రిన్సిపల్ ఘంటసాల.వెంకట్ మరియు కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీమతి వి.నూకరత్నం చేతుల మీదగా బోగి మంట ప్రజ్వలన చేసి శ్రీ సూర్యనారాయణ స్వామికి నైవేద్యంగా పొంగలి తయారు చేసి సాంప్రదాయ వస్త్రంలో వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు కార్యనిర్వాహణాధికారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని,విద్యార్థులందరూ సాంప్రదాయ వస్త్రాలను ధరించి,గొబ్బెమ్మలు చుట్టూ నృత్య ప్రదర్శన,సంక్రాంతి ముగ్గులు మరియు రైతు బజార్ ఏర్పాటు చేసి అలరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం పిఆర్వో కొండలరావు,దేవస్థానం అధికారులు,సిబ్బంది, కళాశాల అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆశా వర్కర్లకు సామ్ సంగ్ మొబైల్స్ వితరణ



అన్నవరం.... తూర్పుగోదావరి జిల్లా రావికంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు "ఆశా డే" సందర్భంగా శనివారం ప్రభుత్వం వారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి ద్వారా పంపిణీ చేయబడిన సామ్ సంగ్ మొబైల్స్ ను స్థానిక ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ పి.రవికుమార్ మరియు డాక్టర్ విక్రమ్ గారి చేతుల మీదుగా పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆశా నోడల్ పర్సన్ రాజ కుమారి మాట్లాడుతూ ఇక నుండి క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు చేస్తున్న ఆన్లైన్ ప్రక్రియ ఆశా వర్కర్లు చేయవలసి ఉందని,దీని వలన సరైన సమయంలో గర్భిణీలను గుర్తించడం, వ్యాధి నిరోధక టీకాలు ఆన్లైన్ చేయడం, మొబైల్ ద్వారా యాప్ నందు అప్లోడు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హైల్త్ సూపర్వైజర్లు సత్యనారాయణ మూర్తి,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ నైతిక విలువలు

## విద్యాలయాలకు ఎంతో అవసరం



గాజువాక : (విజయభాను న్యూస్) : క్రమ శిక్షణ , నైతిక విలువలు, ఆడపిల్లలకు భద్రత, వ్యక్తిత్వ వికాసం విద్యాలయాలకు ఎంతో ముఖ్యమని, తాము వాటిపై ఎక్కువ దృష్టి పెడతామని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రేమ అన్నారు. స్థానిక మల్కాపురం లోని సెయింట్ ఆన్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగిస్తు - తమ మీద నమ్మకం తో పిల్లలను తమ విద్యా సంస్థ లో చేర్చి నందుకు, కృతజ్ఞతలని అన్నారు. దేశానికి మంచి నాయకురాలు సమర్థవంతమైన నాయకులను అందివ్వడం తవ ధ్యేయం అని అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న జాతీయ సేవా పదకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్. భాగ్య లక్ష్మి మాట్లాడుతూ- నాణ్యమైన విద్యను అతి తక్కువ ఖర్చుతో అందివ్వడమే సెయింట్ ఆన్స్ ప్రత్యేకత అని అన్నారు. పూర్తిగా విద్యా రంగాకే అంకితమైన సిస్టర్స్ 24 గంటలు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ , వారిని సన్మార్గంలో నడిపించడానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎటువంటి కష్టానైనా తట్టుకొని, జీవితాన్ని ప్రేమించే శక్తిని ఇచ్చేది నిజమైన విద్య అని అన్నారు. సమావేశంలో అధ్యాపకులు - 2. ఆదిశేషు, డా. జి. లలిత, బిందు సింగ్, శాంతి దన్య,శాంతి తదితరులు, విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనేక మంది తల్లి దండ్రలు సెంట్ ఆన్స్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని పరిశోధనలకు వీలు కలిగించే లాబ్స్ ను సిద్ధం చేయలని కోరారు .

# గాంధీ పార్కువద్ద బీజేపీ నేతలు మౌనదీక్ష




గాజువాక : (విజయభాను న్యూస్ ): దేశ ప్రధాని నరేంద్ర మోడి పంజాబ్ లో పర్యటన నేపథ్యంలో రక్షణ కల్పించడంలో విఫలమైన పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంకి వ్యతిరేకంగా మౌన దీక్ష నిర్వహించారు. బీజేపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర పిలుపు మేరకు గాజువాక నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు ఆద్వర్యంలో పెదగంట్యాడ నడుపూరు గ్రామంలో మహత్మ గాంధీజీ విగ్రహం వద్ద శనివారం మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్బంగా నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర పిలుపుమేరకు మౌన దీక్ష చేపట్టామని,పంజాబ్ రాష్ట్రంలో అదికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సాక్ష్యాత్తు దేశ ప్రధానికే భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమయిందని వెంటనే కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. దేశ ప్రధానికి భద్రత కల్పించలేని వారు ఇంక ఆ రాష్ట్ర ప్రజలను ఏ విదంగా కాపాడగలరని ఆ రాష్ట్రంలో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. ఈ మౌన దీక్ష లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, మండల అధ్యక్షులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, కిలాడి. ముసలయ్య , కోసూరు.తాతారావు,పేర్ల.అప్పారావు ,మహిళ మోర్చా నాయకులు లలిత , పద్మ,రాష్ట్ర కౌన్సిల్ మెంబరు ములకలపల్లి ఈశ్వర్రావు , బాటా శ్రీను, ఓబిసి మోర్చా జిల్లా ప్రదాన కార్యదర్శి బొండా.యల్లాజీరావు,ప్రసాద్ శర్మ,ఆది.సత్తిబాబు,ప్రకాష్ తదితరులు.

# బాధిత కుటుంబాలకు సొసైటీ సభ్యులు సాయం

దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : మండలంలో కలిగొట్ల గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సమిష్టి స్వయం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మన ఊరు - మన ప్రగతిలో భాగంగా శనివారం అగ్ని బాధిత కుటుంబాలకు నాలుగు వేల రూపాయలు సహాయం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష,కార్యదర్శులు గొర్రె పోటు చిన్నంనాయుడు, రుత్తల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కలిగొట్ల గ్రామానికి సంబంధించి మాకు ఉన్న సమయంలో కాస్త సమయాన్ని కేటాయించి సొసైటీ ఏర్పడి తమ వంతుగా చేయాలన్నదే ఈ సొసైటీ లక్ష్యమన్నారు .ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉషోదయలో సంక్రాంతి సంబరాలు

దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : స్థానిక ఉషోదయ హైస్కూల్ లో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల మేనేజర్, డైరెక్టర్ పెద్దాడ వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం ఈ సంక్రాంతి సంబరాలలో పాల్గొని ఆనందంగా గడిపారు. భోగిమంటలు, గొబ్బెమ్మలు, చెరుకుగడలు, గంగిరెద్దులతో సంక్రాంతి వేడుకలు కు అద్దం పట్టేలా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించి సాంప్రదాయ విలువలను విద్యార్థులకు తెలియజేశారు.

మొదటి పేజీ తరువాయి

# 5 రాష్ట్రాలకు మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా..

తగ్గే అవకాశం ఉందని చెప్పారు.

**అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ.40లక్షలకు పెంపు..**

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నికల ఖర్చును రూ. 40లక్షలకు పెంచుతున్నట్లు సీఈసీ వెల్లడించారు. ఇక క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులకు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీలు తమ వెబ్‌సైట్లలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఆ అభ్యర్థులను ఎందుకు ఎన్నుకున్నారో కారణాలు కూడా చెప్పాలని తెలిపారు.

**జనవరి 15 వరకు రోడ్‌షోలు రద్దు..**

కరోనా ఉద్ధృతి దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ వర్చువల్‌గా ప్రచారం నిర్వహించుకోవాలని సీఈసీ సూచించారు. జనవరి 15 వరకు ర్యాలీలు, రోడ్‌షోలు, పాదయాత్రల వంటి బహిరంగ ప్రచారాలపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించారు. ఆ తర్వాత పరిస్థితులను సమీక్షించి ప్రచారాలపై మళ్లీ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# రైళ్లలో ప్రయాణించాలంటే.. టీకా సర్టిఫికెట్ తప్పనిసరి

వ్యాప్తి దృష్ట్యా దక్షిణ రైల్వే?.. జనవరి 6 నుంచే పలు రకాల ఆంక్షలను విధిస్తూ వస్తోంది. రైళ్లను 50 శాతం సీటింగ్ సామర్థ్యంతోనే నడుపుతోంది.

గడిచిన 24 గంటల్లో తమిళనాడులో కొత్తగా 8,981 మందికి పాజిటివ్‌గా తేలింది. మహమ్మారితో మరో 8 మంది మృతిచెందారు. కాగా మొత్తం కొవిడ్ కేసుల సంఖ్య 27,76,413కు చేరింది. రాష్ట్రంలో మొత్తం మరణాల సంఖ్య 36,833కు చేరింది. తమిళనాడులో ఇప్పటివరకు 121 మందికి ఒమిక్రాన్‌గా నిర్ధరణ అయింది. ఇందులో 117 మంది కోలుకున్నారు.

# అప్పన్న ఆలయ గోపురాల ను అద్భుతంగా తీర్చాలి

*- గంగ ధార వద్ద రాతి శాసనాల పరిరక్షణ చేయండి*

*- గోపురాల పై దేవుడి బొమ్మలకు మెరుగులు అద్దాలనీ*

*- ట్రస్టు బోర్డు సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులతో ఈఓ సూర్య కళ పర్యటన*



సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయ రాజగోపురం కు ముక్కోటి ఏకాదశి లోపు అందమైన రంగులతో అలంకరణ పూర్తి చేయాలని ఇఓ ఎంవి సూర్య కళ ఇంజనీరింగ్ అధికారులు ను ఆదేశించారు. ప్రధాన గోపురం, ఉత్తర గోపురం పై జరుగుతున్న పెయింటింగ్ పనులను పరిశీలించి సూచనలు చేశారు. గోపురాల పై దేవుడి బొమ్మలు ఆకర్షణీయంగా కనిపించేలా తీర్చి దిద్దాలని ఆమె చెప్పారు.ట్రస్టు బోర్డు సభ్యులు దాడి దేవి, దినేష్ రాజ్, సూరిబాబు తో శనివారం సాయంత్రం ఆమె ఆలయ పరిసర ప్రాంగణాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు పరిశీలించారు. ఉత్తర ద్వారా వద్దం ప్రధాన వేదికను పరిశీలించారు. అనంతరం గంగ ధార వద్ద స్వామివారికి ధారోత్సవలు నిర్వహించే మండపాన్ని పరిశీలించారు.అక్కడ చరిత్ర సాక్ష్యంగా వున్న శిలా శాసనాలను చూసి నిశితంగా పరిశీలన చేశారు.వాటిని బద్ర పరచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.అలాగే గంగ ధార వద్ద సీతారాముల విగ్రహాల కు రంగులు వేసి అందంగా మార్చాలని కోరారు. ఈ ఈ శ్రీనివాస రాజు, హరి, ఏ ఈ అప్పారావు, బాబ్జీ, రవిరాజు, రాఘవ కుమార్, ఆనంద కుమార్ తదితరులున్నారు.

# కాన్వెంట్ జంక్షన్ కు తుమ్మెదల మెట్టగా నామ కరణం చేయటానికి కృషి

**- అప్పన్న ఆలయ ప్రచారానికి, అభివృద్ధికి జివియంసి పూర్తి సహకారం**

**- అప్పన్న సన్నిధిలో**

**మేయర్ గొల గాని హరి వెంకట కుమారి**



సింహాచలం (విజయభాను న్యూస్) : నగరం లోని కాన్వెంట్ జంక్షన్ ప్రాంతాన్ని అప్పన్న స్వామి అద్భుత మహిమకు గుర్తుగా " తుమ్మెదల మెట్ట " గా నామ కారణం చేయటానికి కృషి చేస్తానని మేయర్ హరి వెంకట కుమారి తెలిపారు. శనివారం మేయర్ కుటుంబ సమేతంగా సింహాద్రి నాధుని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పన్న స్వామి ఆలయ అర్చక స్వాములు తుమ్మెదల మెట్ట విశిష్టతను వివరించారు. అప్పన్న ఆలయం పై తురగుల పాలనలో దండయాత్ర జరిగినపుడు ఆలయ శిల్ప కళను పాడు చేశారని, దానికి ప్రతిగా అప్పన్న స్వామి వారు గండు తుమ్మెదల రూపంలో దుండగులను వెంబడించి కాన్వెంట్ జంక్షన్ వరకు తరిమిన అద్భుత మహిమను ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం కల్పిస్తామని అన్నారు. చరిత్ర ను కాపాడుకోవటం మన బాధ్యత అన్నారు. అలాగే సింహాచలం దేవస్థానం అభివృద్ధికి జివియంసి తరపున సంపూర్ణ సహకారం చేస్తానని హామీ ఇచ్చారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు సేవలు అందించాలని జోనల్ కమిషనర్ చక్రవర్తి కి ఆదేశించారు. దేవస్థానం వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి మేయర్ దంపతులను, పిల్లలను ఆశీర్వదించారు.

## కూలీలు అమోదంతోనే

# మేట్లను నియామించాలి



దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : గ్రామీణ ఉపాధి హామిచట్టంలో కూలీల ఆమోదంతో మెట్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సర్క్యులర్ నెంబరు 17035 ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డీ. వెంకన్న డిమాండ్ చేసారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధులను దారి మళ్లించి దోచుకునేందుకు 17035 సర్కిల్ 2021డిసెంబర్ 30న తీసుకు వచ్చిందని తెలిపారు. ఇప్పటి వరకు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల నుండి మేట్ ను ఎన్నుకోవడం జరుగుతుందని. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీల తో సంబంధం లేకుండా పై అధికారులు ఆదేశాలతో కొత్తగా మేట్ ను ఏర్పాటుచేసే విదంగా సర్క్యులర్ నుతీసుకు రావడం జరిగిందని అన్నారు. ఇలా ఆదేశాలు ఇవ్వడం వల్ల పనిపాట చేయని పెత్తందార్లు అధికార పార్టీ కార్యకర్తలు ఇందులో చొరబడి పేదల కడుపు కొట్టి ఉపాధి నిధులను దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీలో పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి పని దినాలు కుటుంబానికి 100 నుండి 200 రోజులకు పనిదినాలు పెంచాలని ఆయన కోరారు.

# దేవదాయశాఖ సహాయ కమిషనర్ గా శిరీష



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ గా కే.శిరీష పదోన్నతి పొందారు. సీతమ్మధార నార్త్ ఎక్సటెన్షన్ లోని షిరిడి సాయి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా పనిచేస్తున్న శిరీష కు అసిస్టెంట్ కమిషనర్ గా ప్రమోషన్ లభించింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రేడ్ వన్ ఈవోగా రిక్రూట్ అయిన శిరీష పూర్ణ మార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గమ్మ ఆలయం, ఇసుకకొండపై ఉన్న శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం, శ్రీ జగన్నాథ స్వామి ఆలయం, ప్రేమసమాజం ఈవో లుగా పని చేశారు.ప్రస్తుతం నక్కవాని పాలెంలోని శివాలయం, సీతమ్మధార నార్త్ ఎక్సటెన్షన్ లోని షిరిడి సాయి ఆలయాలకు ఈవో పని చేస్తున్నారు.విధి నిర్వహణలో ఉత్తమ అధికారిగా పేరొందారు.శిరీషను దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ అడిషనల్ కమిషనర్ ఆజాద్ లు విశాఖపట్నంలో అభినందించారు ఇక్కడికి వచ్చిన వారిని శిరీష్ కలిసి పుష్పగుచ్చాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి శిరీష తో పాటు రామతీర్థం ఈవో డి.వి. వి.ప్రసాద్ కు సహాయ కమిషనర్ గా పదోన్నతి లభించింది.

## నర్సీపట్నంలో నమోదైన

# నాలుగు కరోనా పాజిటివ్ కేసులు

- ఆందోళనలో పట్టణ ప్రజలు
- పలు సూచనలు చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ జి.ఆదిలక్ష్మి



విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) ఏరియా ఆస్పత్రిలో శనివారం ఒక్కరోజే నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ఆసుపత్రి వర్గాలు, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏరియా ఆసుపత్రిలోని ఒక ప్రైవేటు ఉద్యోగి కూడా కరోనా బారిన పడి ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. హైదరాబాద్ నుండి ప్రయాణమై వచ్చిన ఒక ఉద్యోగి తన తల్లిదండ్రులకు చూసేందుకు వచ్చారు. అతనికి పాజిటివ్ ఉన్న విషయం గమనించలేదు. లక్షణాలను చూసి వీరంతా ఏరియా ఆసుపత్రికి వచ్చి తనిఖీ చేసుకోగా, వీరు ముగ్గురికీ కూడా పాజిటివ్ వచ్చినట్లు గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి పట్టణ ప్రజలకు ప్రత్యేక సూచనలు చేశారు. శెలవులు కావడంతో, పండగ వాతావరణం కావడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరిగా మాస్కు ధరించాలనీ, శానిటైజర్ వాడాలని, భౌతిక దూరం పాటించాలని కోరారు.కరోనా విషయం లో కచ్చితంగా ప్రజలు సురక్షితంగా ఉండాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలోని విశాఖ జిల్లా ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి అని గణాంకాలు చెబుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కథనాలు నమ్మకుండా, వాస్తవాలను ప్రజలకు తెలుసు కొని ఎక్కువ ఆందోళనకు గురవవద్దు అన్నారు. లక్షణాలు ఉంటే ఏరియా ఆసుపత్రికి వచ్చి తనిఖీ చేసుకోవాలని ఆమె సూచించారు.

## నాగవంశీయుల ఆత్మీయ కలయిక సభలో

# కొండా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు




విశాఖపట్నం (విజయభాను న్యూస్): పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు నాగవంశం సంక్షేమం సంఘం ఆఫీసులో 2022 నూతన సంవత్సరం సదర్భంగా ఏర్పాటు చేసిన నాగవంశీయుల ఆత్మీయ కలయిక సభలో నాగ వంశం కార్పొరేషన్ చైర్మన్ దంపతులు వైఎస్ఆర్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పల నాయుడు పాల్గొని జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి చనిపోయినతువంటి కాళ్ళ నర్సింగరావు (కొండా) చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ మీటింగ్స్ ఏర్పాటు చేసి అటు కుల సంఘాలు ఇటు కార్పొరేషన్ చైర్మన్ అందరం కలిసి కులాన్ని అభివృద్ధి చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయలని కోరారు సభ ప్రారంభకులు ప.గో జిల్లా బాయి వెంకటేశ్వర రావు (ఏడుకొండలు) సభాను ద్దేసించి మాట్లాడుతూ నాగ వంశీయులకి 13 జిల్లాల్లో గుర్తింపు వచ్చేలా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాకు తగిన న్యాయం చేశారని జిల్లా తరపున నేను మా జిల్లా అద్యక్షులు శ్రవణ్ కుమార్ మరియు సిటీ అద్యక్షులు కార్యవర్గ సభ్యులు అందరము జగన్ మోహన్ రెడ్డికి నాగవంశీయుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని గుర్తింపు ఇచ్చిన ప్రియతమ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారికి ఏళ్ల వేళల రుణపడి ఉంటామాని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప. గో జిల్లా అధ్యక్షులు కాళ్ళ శ్రవణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి బాయి వెంకటరావు.ఉపాధ్యక్షులు ఎచ్చెర్ల ఉమామహేశ్వర రావు.ఏలూరు నగర అధ్యక్షులు సుకాల సత్యనారాయణ. కార్యదర్శి కొండల ప్రసాద్. కోశాధికారి కంటుబోతు రామారావు. ఏర్నింటీ రాజు.కాళ్ళ శ్రీను.డొంక రాజు.కమిటీ సభ్యులు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో మౌన దీక్ష

భీమునిపట్నం : దేశ ప్రధాని నరేంద్ర మోడీ పంజాబ్ పర్యటనలో భాగంగా పంజాబ్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాని భద్రతకు విఘాతం కలిగించేలా ప్రధాని ప్రాణ హాని కలిగించేలా వ్యవహరించిన తీరును నిరసిస్తూ దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించే వివిధ నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం భీమిలి గంటస్తంభం సమీపంలో భీమిలి నియోజకవర్గం భారతీయ జనతాపార్టీ కో ఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో నల్ల మాస్కులు ధరించి మౌన దీక్ష చేశారు. ఈ మౌన దీక్షలో జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, మండల అధ్యక్షులు కంటుభుక్త సునీత, శీరపు రామలక్ష్మి, జిల్లా మొర్చా ప్రదాన కార్యదర్శి పివివి ప్రసాదరావు పట్నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు సారికి సన్యాసిరావు, కురిమెల్ల కవిత, పోలుబోతు విజయ, రిక్కా మంగవేణి, మండల కోశాధికారి సురాడ ఎల్లారావు, మండల ఎస్సీ మోర్చ అధ్యక్షులు రేఖ కరుణారావు, చెన్నా రాము, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం రైతులకు మద్దతు ధర వెంటనే ప్రకటించాలి

### తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి



హుకుంపేట, (విజయభాను న్యూస్): హుకుంపేట మండల కేంద్రంలో, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతు ద్రోహి జగన్ అంటూ నిరసనలు తెలియజేయడం అయినది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కొర్ర తులసి రావు మండల అధ్యక్షులు, సిరాగం సూర్యకాంతం ప్రధాన కార్యదర్శి,శెట్టి లక్ష్మణుడు మాజీ జిసీసీ చైర్మన్, మాట్లాడుతూ..... రైతులకు సరైన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులకు చెల్లించవలసిన ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని.పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని. తడిచిన రంగుమారిన ధాన్యం వెంటనే కొనుగోలు చెయ్యాలని.ఇన్ పుట్ సబ్సిడి,క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని .రైతులకు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ లు, సబ్సిడీ ద్వారా ఇవ్వాలని. ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో పండిస్తున్నటువంటి కాఫీ, మిరియాలు, పసుపు, పిప్పళ్లు, అల్లం మొదలగు పంటలకు పూర్తి స్థాయిలో మద్దతు ధరతో కొనుగోలు చేయాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం అయినది. ఈ కార్యక్రమంలో పాడి బాలన్న సీనియర్ నాయకులు, తామర్ల సత్యనారాయణ అండిబ సర్పంచ్, కొమ్మ రమ ఎంపీటీసీ, సుకూరు బొంజన్న దొర సర్పంచ్,సోకెలి కృష్ణారావు సర్పంచ్, కోడా రాంబాబు వైస్ సర్పంచ్, కిల్లో రాంబబు వార్డ్ మెంబర్, పాంగి కోటి, బద్నాయిని సురేష్ కుమార్ టిడిపి నాయకులు,సుకూరు చందరావు టీడీపీ నాయకులు, పాంగి బేస్ టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సల్ స్కూల్ లో సంక్రాంతి సంబరాలు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : టౌన్ కొత్తరోడ్డు ధరి యూనివర్సల్ స్కూల్ లో సంక్రాంతి సంబరాలు ఎంతో వైభవంగా జరిగాయి. పాఠశాల కరెస్పాండంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పిల్లలు, ఉపాధ్యాయులు అందరూ ఎంతో సంతోషంగా పాల్గొన్నారు. పిల్లలంతా సాంప్రదాయ వేషధారణలో అలంకరించుకుని వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. జనవరి 8వ తేదీ శనివారం ప్రత్యేకంగా పాఠశాలలో నిర్వహించిన రంగోలి వేడుకల్లో పిల్లలందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. పిల్లలకు ఇవ్వబడిన వివిధ అంశాలకు సంబంధించి ఇంగో సృజ నాత్మకంగా ఆలోచించి వారు చిత్రాలు అందరినీ అలరించాయి. సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను తెలిపే విధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో జయప్రదంగా జరిగిందని కరెస్పాండంట్ సత్య నారాయణ అన్నారు.

## శ్రీ సాయి విద్యానికేతన్ క్యాంపస్‌లో...

# అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు



యానాం (విజయభాను న్యూస్) : నల్లం నాగబాబు సారథ్యంలో శ్రీ సాయి విద్యా నికేతన్, నల్లం హై స్కూల్స్ (యానాం మరియు సుంకర పాలెం) సంక్రాంతి సంబరాలు ఘనం గా శ్రీ సాయి క్యాంపస్‌లో జరిగాయి. ఈ సంబరాలుకు ప్రత్యేక ఆకర్షణగా తెలుగువారి సంప్రదాయాలు ప్రకారము రంగవల్లిక నాటకాలు, నృత్య రూపకాలు, విద్యార్థులు చేసి ఆకర్షించారు. రంగవల్లిక పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పెద్దిరెడ్డి జశ్వంత్ (9వ తరగతి, ఎన్ఆర్‌సిఎస్), కరుణాసాగర్ (9వతరగతి, ఎన్ఆర్‌సిఎస్) మరియు జి.స్వాతి (9వ తరగతి, ఎస్ఎస్‌విఎన్ గెలుచుకున్నారు. ప్రత్యేకముగా భారతీయ విలువలు, సంప్రదాయాలతో కూడిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తదుపరి భోగిమంటలు చుట్టూ సంక్రాంతి రాటలు పాడుతూ వారి సంప్రదాయాన్ని కొనియాడారు.

దీనికి సహకరించిన విద్యార్థి తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులు, మూడు సంస్థల ఉపాధ్యాయ బృందమునకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



## న్యాయ శాఖ విభాగంలో సూపరింటెండెంట్ గా

# ఎం.వై.నరసింహ అందించిన సేవలు మరువలేనివి

## ఏపీ జిఈఎ రాష్ట్ర అధ్యక్షులు కె.రామ సూర్యనారాయణ




విశాఖపట్నం (విజయభాను న్యూస్): విశాఖ జిల్లా న్యాయ శాఖ విభాగంలో సూపరింటెండెంట్ గా ఎంవై నరసింహ అందించిన సేవలు మరువలేనివని ఏపీ జి ఈ ఎ రాష్ట్ర అధ్యక్షులు కె.రామ సూర్యనారాయణ కొనియాడారు. స్థానిక హొటల్లో నరసింహ ఉద్యోగ విరమణ ఆత్మీయ సమ్మేళనం కుటుంబ సభ్యులు, మిత్రులు నడుమ ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన రామ సూర్యనారాయణ మాట్లాడుతూ జుడిషియల్ విభాగంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని మంచికి మారుపేరు గా నరసింహ పేరు తెచ్చుకున్నారని, ఇది అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. సన్మాన గ్రహీత నరసింహ మాట్లాడుతూ విధుల నిర్వహణలో తనకు ఎల్లవేళలా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందించిన తోటి ఉద్యోగస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి జిఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంతి ఆస్కారరావు తదితరులు పాల్గొన్నారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

| S.No | Tender Notice No. | No of Works | Value of Works(ECV) | Tender Opening Dt | Closing Date | Contact No |
|---|---|---|---|---|---|---|
| 1 | SH.T.N.No.24/2021-22/E.E-II(WS-M)/DB/ Dt:05-01-2022 | 1 Work | Rs.17.47 Lakhs | 05-01-2022 | 12-01-2022 | 9948078503 |
| | T.N.No.24/2021-22/E.E-II(WS-M)/DB/Dt:05-01-2022 | 8 Works | Rs.106.25 Lakhs | 05-01-2022 | 20-01-2022 | 9948078503 |
| 2 | T.N.No.54/2021-22/EE-II(Works)/DB, Dt:05-01-2022 | 24 Works | Rs.3,65,57,302.00 | 07-01-2022 | 24-01-2022 | 9948525297 |
| 3 | T.N.No.55/2021-22/EE-II(Works)/DB, Dt:06-01-2022 | 13 Works | Rs.2,02,23,455.00 | 10-01-2022 | 27-01-2022 | 9948525297 |

Note: Further details at http://www.tender.apeprocurement.gov.in For Commissioner

# విజయభాను సంపాదకీయం

## మహిళపై వివక్షకు విద్యయే విరుగుడు

రాజకీయ ఆర్థికరంగంలో కాకలు తీరిన పీవీ నరసింహారావుకు సామాజిక పరివర్తనపై కూడా స్పష్టమైన అవగాహన ఉన్నదనడానికి ఆయన అధికార యంత్రాంగంలో తీసుకున్న చర్యలను ఉదాహరణగా చెప్పవచ్చు. మహిళా సమానత్వం సాధించడానికి విద్యాబోధన కీలకమైనదిగా ఆయన భావించారు. 'మహిళల కోసం సంస్కరణలు, భవిష్యత్ అవకాశాలు' అనే అంశంపై న్యూఢిల్లీలో 1991 ఆగస్టు 21వ తేదీన జరిగిన సదస్సులో ఇచ్చిన ప్రారంభోపన్యాసంలో- విద్యారంగంలో వివక్షను రూపుమాపితే, మిగతా సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని ఆయన వివరించారు. మహిళల ప్రయోజనాల పరిరక్షణకు తగిన శాసనం కూడా చేయాలని ఆయన అన్నారు. చట్టం కూడా తోడైతే, విద్యావంతులైన మహిళలు తమ హక్కుల కోసం తామే పోరాడుతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల పట్ల వివక్ష పోవాలంటే సమాజంలో పరివర్తన రావాలని కూడా ఆయన బోధించారు.

నేను కొంతకాలం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నాను. అనేక అంశాలు క్రోడీకరించి మానవ వనరుల అభివృద్ధి శాఖను నిర్మించవలసి వచ్చింది. ఇది ఆయా శాఖల కార్యదర్శులను ఒకచోట చేర్చడం కాదు, మానవ వనరులకు సంబంధించిన అనేక అంశాలను ఒక సమ్యగ్దృష్టితో చూడటం. ఒక టీచర్ ఒక విద్యార్థిని పాఠశాలకు తీసుకుపోవాలని భావిస్తుంది. ఆ విద్యార్థి అనారోగ్యం తో ఉన్నాడు కనుక, తల్లి పంపనంటుంది. 'అనారోగ్యం వైద్యశాఖకు సంబంధించినది, నాది విద్యా శాఖ. అందువల్ల విద్యార్థిని తీసుకుపోతాన'ని టీచర్ అంటుంది. టీచర్‌కు ఆరోగ్యంతో సంబంధం లేదు. కానీ, తల్లి తమ బిడ్డ ఆరోగ్యాన్ని, చదువును అన్నింటినీ పట్టించుకుంటుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ ఒక తల్లి మాదిరిగా అన్ని అంశాలను పట్టించుకోవాలనేది రాజీవ్ జీ ఆలోచన.

కుమారుడు కావొచ్చు, కుమార్తె కావొచ్చు, ఒక శిశువుకు సంబంధించిన అన్ని అంశాలను పట్టించుకోవాల్సిందే. కుమారుడైతే బడికి పంపడం, కుమార్తెను బడికి వద్దనడం సరికాదు. అందువల్లనే బాలికా విద్యకు సంబంధించి ప్రత్యేక కృషి జరుపాలని నూతన విద్యా విధానం సూచిస్తుంది. మొదట విద్యారంగంలో వివక్ష తొలగాలి. విద్యారంగంలో వివక్షను నిర్మూలించినట్లయితే ఇప్పుడు మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు రూపుమాసిపోతాయని నాకు అనిపిస్తున్నది. అన్ని సమస్యలు మటుమాయమైపోతాయని నేననడం లేదు. కొన్ని నిబిడీకృతమైన సమస్యలుంటాయి. కానీ, మానవులతో సాధ్యమైనన్ని సమస్యలు పరిష్కరించవచ్చు. కొందరు తల్లిదండ్రులు కొడుకును బడికి పంపుతారు తప్ప, కుమార్తెను పంపరు. ఈ భావజాలం ప్రజల మనసులో నాటుకుపోయి ఉన్నది. మహిళా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నవారు తల్లిదండ్రుల్లో పరివర్తన తీసుకురావడానికి ప్రయత్నించాలి.

మహిళలు విద్యావంతులైతే, వారి రక్షణకు చట్టం కూడా చేసినట్లయితే, ఇక వారి హక్కుల కోసం వారే పోరాడుతారు. వారి హక్కుల కోసం వారు కాకుండా, మరెవ్వరు పోరాడుతారు? వారు పోరాడకుండా ఉండటం మంచిది కాదు. ఈ పోరాటం ఎంతోకాలం సాగదు. కొంతకాలానికి మగవారు కూడా దిగి వస్తారు. విద్యావంతులైన మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకుంటారు. ఇప్పటికీ సమాజంలో అనేక మూఢ నమ్మకాలు పేరుకుపోయి ఉన్నాయి. సతీసహగమనం వంటి దురాచారాలు పాత కాలానికి సంబంధించినవి ఇంకా ఉన్నాయి. మహిళలు అయిష్టంగానే వీటికి బలవుతున్నారు. ఈ దురాచారం అమలులో ఉన్న ప్రాంతం గురించి నేను వివరాలు సేకరించాను. ఈ హీనమైన దురాచారాన్ని వారు గౌరవ నీయమైనదిగా భావిస్తున్నారు. ఈ దురవగాహన ఉన్నంతకాలం స్త్రీల పట్ల ఈ దురాచారం కొనసాగుతూనే ఉంటుంది. దేవదాసీ విధానం మరో దురాచారం. దేవుడు కను క మాట్లాడగలిగితే మనం చేస్తున్న పనులకు తీవ్ర నిరసన వ్యక్తం చేసేవాడు. మనలాగా మరే సమాజం ఇంతగా దేవుడిని వాడుకొని ఉండదు. దేవుడిని అత్యంత దోపిడి చేస్తున్న వాడు మానవుడే.

రాజకీయాల్లో ఏమీ జరుగుతున్నదనేది చూస్తూనే ఉన్నాం. మూఢనమ్మకాలు మనుషుల్లో గాఢంగా నాటుకుపోయి ఉన్నాయి. మనిషికి మతం అనేది అవసరమే కానీ, మతం పేర అనేక నమ్మకాలు ఎంతో నష్టం చేస్తున్నాయి.

# పేటలో పార్టీ అభివృద్ధి కొరకు అందరూ సమన్వయంగా పని చేయండి

- ఇటీవల జరిగిన పరిణామాలపై నాయకుల అభిప్రాయాలు సేకరణ
- పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే సహించేది లేదు
- పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు
- పేట గ్రూపు రాజకీయాలకు విజయసాయిరెడ్డి చెక్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో అందరూ కలిసి పార్టీ కోసం పని చేయాలని రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర వై ఎస్ ఆర్ సి పి ఉత్తరాంధ్ర ఇంచార్జ్ విజయసాయిరెడ్డి పాయకరావుపేట నాయకులకు కోరారు. పాయకరావు పేట ఎమ్మెల్యే బాబురావు, అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన జెడ్పిటిసిలు ఎంపిటిసిలు,మండల పరిషత్ అధ్యక్షులు, ఇతర నాయకులతో సర్క్యూట్ హౌస్ లో శనివారం ఉత్తరాంధ్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ విజయసాయిరెడ్డి, మంత్రులు కన్నబాబు, అవంతి శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పరిణామాలపై నాయకులను అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఏ ఒక్క నాయకుడి కృషి తోనో పార్టీ గెలవ లేదని,అందరి కలిసి పని చేస్తేనే పార్టీ గత ఎన్నికల్లో గెలిచిందని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను పక్కన పెట్టి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పని చెయ్యాలని సూచించారు. ఎమ్మెల్యే కూడా గతంలో జరిగి విషయాలను పట్టించుకోకుండా కింది స్థాయి నాయకులతో కలుపుకొని వెళ్లాలని విజయసాయిరెడ్డి సూచించారు. ఎమ్మెల్యేతో కలిసి పని చెయాలని సూచించారు.

విశాఖ జిల్లా ఇంచార్జీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఎవరు కూడా పార్టీ లైన్ దాటి వ్యవహరించడానికి వీలులేదని అన్నారు. ప్రోటోకాల్ విషయంలో ఎమ్మెల్యే క్రింది స్థాయి నాయకులను కలుపుకుని ముందుకు పోవాలి అన్నారు. మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ తల్లిలాంటివి పార్టీ కోసం అందరూ కలిసి పని చేయాలన్నారు.

**నియోజకవర్గంలో విబేదాలు లేకుండా కలిసి పని చేస్తాం**

అనంతరం పాయకరావుపేట నియోజకవర్గంలోని జెడ్పిటిసిలు మండల పరిషత్ అధ్యక్షులు, వైఎస్ఆర్ పార్టీ నేతలు మాట్లాడుతూ, పెద్దల సూచనల మేరకు ఇక నుండి ఎమ్మెల్యేతో కలిసి పార్టీ కోసం పని చేస్తామని హామీ ఇచ్చారు.

# వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్

కొయ్యూరు (విజయభాను న్యూస్): కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి. ప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంవివి.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన అరాచకాలకు విరక్తి చెందిన టీడీపీలో చేరుతున్నారన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ గోమం రామకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ పొట్టిగ నూకరాజు, అనిశెట్టి చిరంజీవి, ఉండా నాగేశ్వరరావు, కాకర చందర్రావు, పాంగి రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

## కాలువల అభివృద్ధికి రూ.7.5 కోట్లతో ప్రతిపాదనలు

మాకవరపాలెం (విజయభాను న్యూస్):సాగునీటి కాలువల అభివృద్ధికి రూ.7.5కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ ఏఈ రవికుమార్ తెలిపారు. మండలంలో బూరుగుపాలెం, బయ్యవరం ప్రాంతాల్లో ఉన్న సాగునీటి కాలువలు సక్రమంగా లేక పూర్తి స్థాయిలో భూములకు సాగునీరందటం లేదు. దీంతో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. లైనింగ్ పనుల రూ.7.5కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఏఈ తెలిపారు.

# పంచాంగం

మాసం : మార్గశిర ; తిథి : సప్తమి ప.3.43; ఉత్తరాభాద్ర ఉ.11.56; రా.వ.12.24ల 2.03.

**ఆదివారం 09-01-2022**

a **మేషం** : సామాజిక కార్య క్రమాల పట్ల ఆసక్తితో వ్యవహరిస్తారు. కళ, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. క్రీడలు, పోటీల్లో రాణిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు. రాజకీయ వ్యక్తులకు చికాకులు తప్పవు. b **వృషభం** : నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్ కలిసివచ్చును. మీ లక్ష్యసాధనకు ప్రముఖులు, ప్రభుత్వ అధికారుల సహకారం అందుతుంది. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. అవివా హితులకు అనుకూలం. కొత్త పరిచ యాలు ఏర్పడతాయి. C **మిథునం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత వహించండి. ఆత్మీయులకు ఒక ముఖ్య సమాచారం అందించడం వల్ల మీ గౌరవ ప్రతిష్టలు ఇనుమడిస్తాయి.e **కర్కాటకం** : వైద్య రంగంలో వారికి శ్రేయస్కరం. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. విద్యార్థులలో నూతనోత్సాహం చోటు చేసు కుంటుంది. వాహన యోగం పొందు తారు. e **సింహం** : ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలకు సంబం ధించిన ఒక నిర్ణయం తీసుకుంటారు. ఆడిటర్లకు విశ్రాంతి లభించును. రాబడికి మించిన ఖర్చులు పెరగడంతో ఒకింత ఆందోళనకు గురవు తారు. స్త్రీలకు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. f**కన్య** : కుటుంబీకుస మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. మార్కెటింగ్ రంగాల్లో వారికి అనుకూలత. నిరుద్యోగులతు ఆశాజనకం. దైవ, శుభకార్యాల్లో చురుకుగా వ్యవహ రిస్తారు. స్త్రీలు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. g **తుల** : ప్రేమికుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. వాహన చోదకులు వాహనం నడుపునపుడు మెల కువ వహించండి. ఆత్మీయులతో విందులు, పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. వస్త్ర, బంగారు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు పురోభివృద్ధి. ప్రముఖుల కల యిక ప్రయోజనకరంగా ఉంటుంది.h **వృశ్చికం** : స్త్రీలకు అపరిచిత వ్యక్తుల విషయంలో మెలకువ అవసకం. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. భాగ స్వామి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వస్త్రాలు, వస్తువులు అమర్చు కుంటారు. i**ధనుస్సు** : టెక్నికల్, ఎలక్ట్రానికల్ రంగాలలో బాగా అభివృద్ధి చెందు తారు. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. సన్నిహితుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. స్త్రీలకు విలువైన వస్తువులు, ఆభరణాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లు సంతృప్తి, పురోభివృద్ధి. j**మకరం** : మీ ముఖ్యుల కోసం ధనం బాగా వెచ్చించవలసి వస్తుంది. నూతన దంపతులకు ఎడబాటు తప్పదు. ఉద్యోగస్తులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. మీ సంతానం మొండి వైఖరి మిమ్మలను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవసరం.నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవ తారు.k **కుంభం** : నిరు ద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకారం అందిస్తారు.

# సీనియర్ జర్నలిస్ట్ హేమసుందర్ ను సత్కరించిన మిజోరాం గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : జర్నలిజంలో అడుగుపెట్టి 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సీనియర్ జర్నలిస్ట్ నేమాల హేమసుందరరావును మిజోరాం గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు అభినందించి సత్కరించారు. నెహ్రూ యువ కేంద్ర, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ,రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్,ప్రకృతి చికిత్సాలయం సంయుక్త ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో నిర్వహించిన స్వామి వివేకానంద 159వ జయంతి,ఆజాదీ క అమృత్ మహోత్సవ్ సేవా కార్యక్రమాలకు గవర్నర్ హరిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామి వివేకానంద చిత్రపటం ముందు జ్యోతి వెలిగించి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

అనంతరం రాజీవగాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోవిడ్ కష్టకాలంలో వైరస్ సోకిన బాధితులకు తమ ప్రాణాలు సైతం లెక్క చేయక సకాలంలో వైద్య సేవలందించిన వైద్యులకు, పోలీస్ శాఖ , పారిశుధ్ధ్య పనివారలతో పాటు సీనియర్ జర్నలిస్ట్ నేమాల హేమసుందరరావులకు ముఖ్యఅతిథి మిజోరాం గవర్నర్ డా.కంభంపాటి హరిబాబుచే దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.సత్కారం అందుకున్న వారిలో

ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పివి సుధాకర్,విమ్స్ డైరెక్టర్ కే. రాంబాబు,విమ్స్ జనరల్ ఫిజీషియన్ ప్రొఫెసర్ సత్యప్రసాద్, ప్రకృతి చికిత్సాలయం నిర్వాహకులు డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి , ఇ ఎన్ టి విశ్రాంత సూపరింటెండెంట్ కృష్ణ కిషోర్,మహారాణి పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సోమశేఖర్

తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ తో పాటు నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మహేశ్వర రావు , నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి ఏ రాంప్రసాద్ ,ఎస్. మహేష్, ఎస్. చాతుర్య, గేదెల శ్రీహరి , చొక్కాకుల రాంబాబు,సిహెచ్ రాజబాబు ,పల్లా చలపతిరావు, ఓ ఆల్బర్ట్ ,కే రామ్ కుమార్ , డాక్టర్ వై లక్ష్మణరావు , టీ గిరిజ ,వెంకట అప్పారావు ,నరేష్ , మోహన్ , మంగ, రమణ ,కొండమ్మ ,బంగారమ్మ ,శారద తదితరులు పాల్గొన్నారు .

# రాయల్ నిర్మాణ్ ది రైజ్ ఫస్ట్ లో అలరించిన రాయల్ క్వీన్ ,కింగ్,కింగ్ పోటీలు





విశాఖ సిటీ (విజయభాను న్యూస్) : రాయల్ నిర్మాణ్ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా క్వీన్, కిడ్ ,కింగ్ పోటీలు అందరిని అలరించాయి. సంక్రాంతి సందర్భంగా వుడా చిల్డ్రెన్స్ ఏరిన లో ఎం.రాజు ఆధ్వర్యంలో అద్భుతంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రతి ఏటా ఘనం గా ఈ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషమని , ఈ సంవత్సరం నుండి వీరుమామ తో కలిపి ఈ పోటీలు ప్రతి ఏటా జరుపుతామని ఎం డి రావు తెలిపారు. న్యాయ నిర్ణేతలు గా ఇండియన్ సిల్క్ క్వీన్ ప్రసన్న, విశాఖ సౌజన్య, మిస్ విశాఖ సృజని , బటర్ఫ్లై రాంప్ క్వీన్ క్రిస్టి నా వ్యవహరించారు. విజేతలతో కేక్ కట్ చేసి బహుమతి ప్రదహనం తో పాటు సంక్రాంతి సందేశాన్ని ఇచ్చారు. వ్యాఖ్యాతలు గా ఆశ, వీరుమామ వ్యవహరించారు.

# జీతాలు తగ్గుతాయని దుష్ప్రచారం చేయడం సరికాదు : చంద్రశేఖర్‌రెడ్డి

విజయవాడ: ఉద్యోగుల పీఆర్సీతో పాటు హెల్త్ కార్డుల విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ అదేశించారని ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీపీఎస్ రద్దుపై నియమించిన కమిటీ నివేదిక అందిందని, జూన్‌లోగా దీనిపై సహేతుకమైన నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. పెరిగిన పీఆర్సీ, 5 డీఏ బకాయిలు, అన్ని ఆర్థిక ప్రయోజనాలు జనవరి నుంచే చెల్లిస్తామని తేల్చి చెప్పారు. 1.28లక్షల మంది గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది 50వేల మంది ప్రభుత్వంలో చేరారని పేర్కొన్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి ఆర్థికంగా భారమే అయినా, సీఎం 23 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారని తెలిపారు. ఉద్యోగులు అడక్కుండానే ఇళ్ల స్థలాలు, ఉద్యోగ విరమణ వయసు పెంచారని చెప్పారు. గ్రామ సచివాయలయాల్లోని ఉద్యోగులకు జూన్‌లో ప్రొబేషన్ ఇచ్చి, జులైలో జీతాలు పెంచాలని సీఎం ఆదేశించారని వెల్లడించారు. ఇందులో కొందరు అవనసరంగా అపోహలు పడుతున్నారని, అందరికీ ఒకే దఫా ప్రొబేషన్ ఇస్తారని స్పష్టం చేశారు. పీఆర్సీ ప్రకటన తర్వాత జీతాలు తగ్గుతాయని, ఇబ్బందులు వస్తాయని దుష్ప్రచారం జరుగుతోందని, ఇది సరికాదని స్పష్టం చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం వాటిని సరి చేస్తుందన్నారు.

ఆందోళన రేగిన మాట వాస్తవం: శివారెడ్డి

పీఆర్సీ ప్రకటన తర్వాత జీతాలు తగ్గుతాయని ఉద్యోగుల్లో ఆందోళన రేగిన మాట వాస్తవమేనని ఏపీ ఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. పీఆర్సీ ప్రకటన తర్వాత 4శాతం నష్టపోయినా, హెచ్ఆర్ఏ ప్రస్తుతం కొనసాగుతున్న విధంగా ఉంటే ఇబ్బంది లేదన్నారు. అధికారుల కమిటీ సిఫార్సులను అమలు చేస్తే ఉద్యోగులు నష్టపోవాల్సిందేనన్నారు. ఇదే విషయాన్ని సీఎంఓ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి వివరించామని తెలిపారు.

# అడ్డగోలుగా వేప చెట్లు నరికివేత

## చోద్యం చూస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలంలో పినకోట, జీనబాడు పంచాయతీల పరిధి గ్రామాలలో రాత్రికి,రాత్రే రోడ్డు ప్రక్కన, కొండలో వేపుగా పెరిగిన వేప చెట్లు మాయమవుతున్నాయి, తెల్లర్లు చూస్తే చెట్టు కొమ్మలు, మొదళ్లు దర్శనమిస్తున్నాయి.భారతీయ సాంప్రదాయ ప్రకారం ఎంతో పవిత్రంగా భావించి పూజించే వేప చెట్లను గిరిజన గ్రామాలలో కొంతమంది సహకారంతో తరలించుకుపోతున్నట్టు సమాచారం, ఇంత జరుగుతున్నా సంబంధిత అటవీశాఖ సిబ్బంది ఎమిచేస్తున్నట్లు, జీనబాడు పారెస్ట్ బేస్ క్యాంప్ వున్నప్పటికి రాత్రికి, రాత్రే అటవీ సంపద ఆలా తరలివెల్లిపోతుంటే అటవీ సిబ్బంది చోద్యం చూస్తున్నారా! ఈ యొక్క బ్యాస్ క్యాంపు వైపు సంబంధిత పారెస్ట్ ఉన్నతా ధికారులు ద్రుష్టి పెట్టకపోవడం వల్ల పారెస్ట్ డిపార్ట్ మెంట్ ఖజానాకు ఘండిపడుతుంది, ఇక్కడి సిబ్బంది చేతివాటం తో పాటు రాజకీయ ఒత్తిలకు తాలోగ్గాక తప్పటం లేదని స్థానికులు గుసగుసలాడుతున్నారు. అర్ధరాత్రి పూట లక్షల కలప అక్రమంగా తరలిచుకుపోతున్నారని, వేలల్లో కలప రవాణాకు పర్మిషన్ తీసుకోని, లక్షల్లో కలప అర్ధరాత్రి పూట దారి మళ్ళీచడం వల్ల ప్రభుత్వ ఖజానా కు బొక్క పెడుతున్నారు, ఒక వేల సంబంధిత వ్యక్తులు పారెస్ట్ డిపార్ట్మెంట్ వారి వద్ద పర్మిషన్ తీసుకోని ఉంటే ఉదయం కలప రవాణా చేయకుండా,రాత్రి పూట ఎందుకు వెళ్ళవలసి వస్తుందో ఇప్పటికైనా గమనించి తగు చర్యలు తీసుకుపోకాపోతే పారెస్ట్ డిపార్ట్మెంట్ ఉన్నతా ధికారులకు పిర్యాదు చేస్తామని నీడ్స్ సంస్థ ప్రతినిధి ఆర్. లక్ష్మణ్ డిమాండ్ చేశారు.ఇకనైనా పారెస్ట్ డిపార్ట్ మెంట్ పైఅధికారులు స్పందించి గిరిజన ప్రాంతం లో జరుగుతున్న కలపకొట్టివేత, అక్రమ రవాణా కట్టడి చేసి అడవులను కాపాడాలని గిరిజనులు వేడుకొంటున్నారు.

# ఆటోడ్రైవర్ల పై అక్రమ కేసులు అరికట్టాలి

## - సీపీఐ మండల కార్యదర్శి గరికిన రాజు



దేవరావల్లి,(విజయభాను న్యూస్) : ఆటో డ్రైవర్లపై రవాణాశాఖ అధికారులు పెడుతున్న అక్రమ కేసులు అధిక జరిమానాలను వెంటనే ఆపాలని సిపిఐ మండల కార్యదర్శి గరికిన రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రం దేవరాపల్లిలో శనివారం ఆటో డ్రైవర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గరికినరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ జిల్లాలో ఆటో డ్రైవర్లపై రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ పోలీసులు పోటీ పడి ఆటో డ్రైవర్లపై పెద్ద ఎత్తున కేసులు నమోదు చేసి వేలాది రూపాయలు జరిమానాలు విధించడంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయి తమ కుటుంబాలను పోషించలేక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు ఇస్తున్న ఈ చలానాలను,అధిక జరిమానాలను ఆపి ఆటో కార్మికుల కుటుంబాలను రక్షణ కల్పించాలని కోరారు.లేని పక్షంలో ఆటో కార్మికుల ఆందోళనకి పునుకుంటారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మంచినీటి కొలాయి మరమ్మతులు చేపట్టి

# గిరిజనులకు మంచినీరు అందించాలి

## జనసేన మాజీ ఎంపిటిసి దురియా, సాయిబాబా, గెమ్మెలి సన్యాసిరావు



అనంతగిరి (విజయభాను న్యూస్) : విశాఖ మన్యం అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం, కొండిబ పంచాయితీ పరిధిలో గలమువ్వం గూడ గ్రామాల్లో శనివారం ఉదయం జనసేన బృందం ఆధ్వర్యంలో ఆయన గ్రామంలో పర్యటించడం జరిగినది, పర్యటనలో భాగంగా గ్రామస్తులతో సమావేశమై సమస్యల పట్ల చర్చించడం జరిగినది, ముఖ్యంగా ఆయా గ్రామంలో కొలాయి మరమత్తు అవడం వలన మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులకు సూర్య అవుతున్నట్లు జనసేన పార్టీ దృష్టికి తీసుకు వచ్చారు, ఈ సందర్భంగా సాయిబాబా, దురియా, సన్యాసి రావు తదితరులు మాట్లాడుతూ ముందుగా ను జనసేన మాటలు జనం లోకి తీసుకెళ్లారు, అనంతరం ముమ్వంగూడ గ్రామంలో కొలాయి మరమ్మతులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం చాలా విడ్డూరంగా ఉందని, తక్షణమే ప్రభుత్వ సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కొలాయి మరమ్మతులు చేపట్టి గిరిజనులకు మంచినీరు అందించగలరని ఈ సందర్భంగా ప్రభుత్వానికి జనసేన పార్టీ డిమాండ్ చేశారు రాష్ట్రంలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేల నుండి ఆకాశం అందే వరకు నిత్యావసర సరుకులు విపరీతంగా పెరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు, కావున రానున్న రోజుల్లో వైయస్సార్ పార్టీకి బుద్ధి చెప్పాలని, రానున్న రోజుల్లో జనసేన పార్టీకి ఆదరించాలని గిరిజనులను సూచించారు, ఈ కార్యక్రమంలో జన సైనికులు నర్సింగ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 10న ముఖ్యమంత్రి వద్దకు విజ్ఞాపక యాత్ర



మాట్లాడుతున్న మేకా సత్యనారాయణ

గొలుగొండ (విజయభాను న్యూస్ : జనవరి 10వ తేదీన ముఖ్యమంత్రి వద్దకు 'విజ్ఞాపన యాత్ర నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకా సత్యనారాయణ తెలిపారు. శనివారం ఏఎల్పురంలో విలేకర్లతో మాట్లాడారు. జనవరి 10వ తేదీన ముఖ్యమంత్రి వద్దకు విజ్ఞాపనయాత్ర చేస్తామని తెలిపారు. 2015 నుండి జామాయిలు, సుబాబులు, సరుగుడు కర్రలకు ధరలు తగ్గుతూ వస్తున్నాయని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం లోకి వస్తే టన్నుకి 5000 రూపాయలు చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా, వాటి ధరలు పెంచకపోగా టన్నుకి వెయ్యి రూపాయలు తగ్గించి పేపర్ మిల్లు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు పండించిన పంట నష్టాలను గమనించి ఇచ్చిన మాట నెరవేరుస్తారని, రైతులను రక్షించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సరుగుడు సంఘం జిల్లా కార్యదర్శి జి.గురుబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామానాయుడు, మేకా భాస్కర్ పాల్గొన్నారు.

## ధాన్యం రైతులకు మద్దతు ధర వెంటనే ప్రకటించాలి

## తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డిమాండ్




పాడేరు (విజయభాను న్యూస్): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతు ద్రోహి జగన్ అంటూ నిరసనలు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ రైతుపండించిన పంటకు కనీస ధర పెట్టకపోవటం జగన్ ప్రభుత్వం చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతుపండించిన పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సరైన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులకు చెల్లించ వలసిన ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని.పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని.తడిచిన రంగుమారిన ధాన్యం వెంటనే కొనుగోలు చెయ్యాలని.ఇన్ పుట్ సబ్సిడి,క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని. రైతులకు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ లు, సబ్సిడీ ద్వారా ఇవ్వాలని.ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో పండిస్తున్న టువంటి కాఫీ, మిరియాలు, పసుపు, పిప్పళ్లు, అల్లం మొదలగు పంటలకు పూర్తి స్థాయిలో మద్దతు ధరతో కొనుగోలు చేయాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టీల్ కార్మికులు ధర్నాకు సిద్ధం



గాజువాక : (విజయభాను న్యూస్ ):స్టీల్ కార్మికుల కొత్త వేతనల అమలుపై యాజమాన్య వైఖరిని నిరసిస్తూ పోరాటానికి సిద్ధం అని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యానికి స్పష్టం చేశారు. శనివారం ఉక్కు కర్మాగారం లోని ఎల్ ఎమ్ ఎమ్ ఎమ్ లో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వ్యక్తలు మాట్లాడుతూ డిసెంబర్ 24 వ తారీకు స్టీల్ సి. ఎం. డి, ఇతర డైరెక్టర్ల సమక్షంలో రెండున్నర గంటలు సమావేశం జరిగిందని అన్నారు. దీనిలో ప్లాంట్ లో ఉన్న 15 కార్మిక సంఘాల ప్రతినిధులు లో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. దీనిలో కార్మిక సంఘాల ప్రతినిధులు ఏకోన్ముఖంగా యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను ఏప్రిల్ మాసం వరకు ఆగుదామని, కానీ కొత్త

బేసిక్, డిఎ లను తక్షణం అమలు చేయడం ద్వారా కార్మికులలో మానసిక ధైర్యాన్ని పెంచడం సాధ్యమవుతుందని, తద్వారా రానున్న మూడు మాసాలలో మరో ఎనిమిది వేల కోట్ల ఉత్పత్తి దిశగా ఉక్కు కర్మాగారం సాగుతుందని వారు వివరించారు. ఈ ప్రతిపాదనలతో యాజమాన్యం పై ఒత్తిడి లో భాగంగా జనవరి 3 వ తారీఖున మరొక సమావేశం నిర్వహించడం మంచిదని ప్రతినిధులు చెప్పారు. దీని పై స్పందించిన యాజమాన్యం జనవరి 7 తారీఖున సమావేశం నిర్వహిస్తామని వారు తెలిపిన మేరకు ప్రతినిధులు సంతృప్తి చెందక పోయినప్పటికీ అంగీకరించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి స్పందన లేకపోవడంతో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి తార్కాణమన్నారు. ఈనెల 11 వ తారీకున అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా 12 వ తారీఖున బాల చెరువు గేటు వద్ద ధర్న, 18 వ తారీఖున హెచ్ఓడీ కార్యాలయాల ఎదుట ఉదయం 10 గంటల నుండి ధర్నా 18 వ తారీఖున మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సి. ఎం. డి కి సమ్మె నోటీసు ఇస్తున్నామని తెలిపారు 20వ తారీఖున ఉదయం 11 గంటలకు ఈడీ (వర్క్స్) కార్యాలయం ముట్టడి

25 వ తారీఖున పూర్తి రోజు( ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ధర్నా జనవరి నెలాఖరుకు సమ్మె పై కార్యక్రమాల ద్వారా యాజమాన్య నిరంకుశ వైఖరిని ప్రశ్నించాలని వారు వివరించారు. దీనిలో ప్రతి ఒక్క ఉక్కు కార్మికుడు, కాంట్రాక్టు కార్మికుడు పాల్గొని పెద్ద ఎత్తున తమ నిరసనను తెలియజేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు జె. అయోధ్య రామ్, బి అప్పారావు, కె. సత్య నారాయణ, గంధం జె. వెంకట్రావు, సుబ్బయ్య, డి ఆదినారాయణ, కె ఎస్ ఎన్, వై మస్తానప్ప, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస్, డి వి రమణ రెడ్డి, డి సురేష్ బాబు, పి. ఉగ్రం, జయ, సిహెచ్ సన్యాసిరావు, డేవిడ్, టి. జగదీష్, జి ఆర్ కె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో

# ఘనంగా సంక్రాంతి సంబరాలు





భీమునిపట్నం : స్థానిక సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఇందులో ఎనిమిది తొమ్మిది పదవతరగతి విద్యార్థినిలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఇందులో హెచ్ ఎం మేరీ జుడిన్ శాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జాతీయ యువజనోత్సవాలకు ఏయూ విద్యార్థులు

## అభినందించిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




జాతీయ సేవ పథకం విద్యార్థులతో వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ (విజయభాను న్యూస్) : జాతీయ యువజనోత్సవాలకు ఆంధ్రవిశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం విద్యార్థులు ఎంపిక య్యారు. వీరిని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యా లయంలో అభినందించారు.

ఈ నెల 12 నుంచి 16 వరకు 25వ జాతీయ యువ జనోత్స వాలు పాండిచ్చేరిలో జరగాల్సి ఉంది. కోవిడ్ కారణంగా వీటిని వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు గిట్టుబాటు ధర కలిపించాలి



అరకులోయ (విజయభాను న్యూస్) అరకు వ్యాలీ మండలకేంద్రం లో తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు సివేరి దోన్ను దొర ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రం లో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి.దాసు బాబు మాట్లాడుతూ రైతులకు సరైన గిట్టు బాటు ధర కలిపించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబు రావు, బూర్జ లక్ష్మి అప్పాలు,కార్తీకో అరుణకుమారి. సర్పంచ్ మహదేవ్ సాయి రామ్ , కుమార్ ఓనాది ,ద్రౌపతి ,నీరాజకుమారి, నూకరత్నం,కళావతి ,మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాడేరు గ్రామ పరిసర ప్రాంత ప్రజలకు

## పాడేరు పోలీస్ వారి విజ్ఞప్తి

పాడేరు (విజయభాను న్యూస్) : పండగ సందర్భంగా తమ సొంత ఊరికి వెళ్ళే వారందరు ఇంట్లో విలువైన వస్తువులు వుంచకుండ బ్యాంక్ లాకర్ లో పెట్టుకోవాలను లేక తమతో తీసుకొని వెళ్లవలెను.



దొంగతనాలు జరిగే అవకాశం వుంది కావున తగు జాగ్రత్తలు పాటించ వలెను. ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్ళేవారు పోలీస్ స్టేషన్ లో వివరాలు ఇవ్వవలెను. సంక్రాంతి సంద్భంగా కోడి పందేలు, పేకాట ఇతర జూదం వంటి ఆటలు ఆడిన వారిపై కటిన చర్యలు తీసుకోబడును. సంక్రాంతి మీ కుటుంబ సభ్యులతో కలసి సరదాగా చేసుకోవలెను.

# గంజాయి అక్రమ రవాణా

## 6 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు



అనంతగిరి (విజయభాను న్యూస్) : ఎస్ఐకి గంజాయి అక్రమ రవాణా గురించి నమ్మదగిన సమాచారం వచ్చినందున అనంతగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ దగ్గర వాహన తనిఖీ చేయుచుండగా ఉదయం సుమారు 10 గంటల సమయంలో అరకు వైపునుండి విశాఖపట్నం వైపు వచ్చుచున్న AP 31 DE 6605 నెమరు గల బైకు మీద అరకులోయ బిట్టంగుడ గ్రామం, పెడలబుడు పంచాయతీకి చెందిన పెట్టెలి బొడన్న సన్ ఆఫ్ మధు 36 సంవత్సరం, కొండదొర అనే వ్యక్తి 6 కేజీల గంజాయి అక్రమంగా, తరలించి...

విశాఖపట్నం లో తీసుకొని వెళ్లి బెంగుళూరు కు చెందిన మహేష్ కు అప్పగించుటకు తీసుకొని వెళుతుండగా పట్టుకొని అరకు కోర్టు లో హాజరుపరిచి, తదుపరి వారి ఉత్తర్వుల ప్రకారం విశాఖపట్నం సెంట్రల్ జైలుకి పంపడమైనది.

# ఐఏఎస్ఇలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

## ఆటపాటలతో అలరించిన విద్యార్థులు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ఏయూ (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వ విద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఇ)లో సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిసాయి. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు బహుమతుల ప్రధానోత్సవంతో ముగిసింది. సంక్రాంతి పండుగను గుర్చుచేసుకునే విధంగా ఐఏఎస్ఇ ప్రాంగణంలో వేడుకలను ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో కార్యక్రమాలలో పాల్గొన్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పిండివంటల తయారీ పోటీలు నిర్వహించారు. లిమన్ అండ్ స్పూన్ ఆట, జానపద నృత్యాలతో విద్యార్థులు అలరించారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పాలక మండలి సభ్యురాలు ఆచార్య క్రిష్ణమంజరి పవార్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె భట్టి, డాక్టర్ టి.షారోన్ రాజు, డాక్టర్ నాగరాజ కుమారి, డాక్టర్ చల్లా రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.

# భాజపా ఆధ్వర్యంలో

## జివియంసి గాంధీ విగ్రహం వద్ద మౌనదీక్ష

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ జీ పంజాబ్ పర్యటనలో భాగంగా పంజాబ్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాని భద్రతకు విఘాతం కలిగించేలా ప్రధాని ప్రాణ హాని కలిగించేలా వ్యవహరించిన తీరును నిర సిస్తూ దేశవ్యాప్తంగా భార తీయ జనతా పార్టీ ఆధ్వ ర్యంలో వారం రోజులపాటు నిర్వహించే వివిధ నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు కలిగొట్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వి ఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పి విష్ణుకుమార్ రాజు ముఖ్య అతిథులు గా విచ్చేసి నల్ల మాస్కులు ధరించి మౌన దీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. సుహాసిని ఆనంద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.విజయానంద రెడ్డి, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కే ఎన్ పి చక్రవర్తి, అనకాపల్లి పార్లమెంట్ జిల్లా ఇంచార్జ్ ఎస్ వి ఎస్ ప్రకాష్ రెడ్డి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, కొప్పిశెట్టి, దామోదర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ వర్మ, బోగాది స్వామి నాయుడు, చొక్కాకుల రాంబాబు, ధానేష్, కొప్పిశెట్టి శంకర్రావు, సురేష్ బాబు మొదలగు జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



# రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనా ని కలిసిన

## ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిటీ



పాడేరు(విజయభాను న్యూస్) : ఢిల్లీలో ఆంధ్ర భవనంలో రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనా ని కలిసిన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిటీ. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిటీ చైర్మన్ తెల్లం బాలరాజు, పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి మరియు రంపచోడవరం శాసన సభ్యులు ధనలక్ష్మి పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, షెడ్యూల్ తెగల అభివృద్ధి కొరకు కేంద్రం నుండి వచ్చే నిధులు మరియు వాటి విని యోగంపై రెసిడెంట్ కమిషనర్ భావనా సక్సేనాతో చర్చించారు.

### అసాంఘిక కార్యకలాపాలు

# నిర్వహిస్తే చర్యలు తప్పవు


### మాకవరపాలెం ఎస్సై రామకృష్ణరావు



మాకవరపాలెం (విజయభాను న్యూస్) : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, పేకాట, గుల్లాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో జరిగే తీర్థాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాటలు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. దీనికి ఆయా గ్రామాల పెద్దలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా కూడా ఏర్పాటు చేశామన్నారు. పందాలు, పేకాటలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే 9440904216 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి కరోనా నిబంధనలు పాటించాలని ప్రజలకు కోరారు. పండుగ సందర్భంగా ఎవరైనా ఊళ్లకు వెళితే ముందుగా పోలిసులకు తెలియజేయాలన్నారు.

# రెండు రోజుల విశ్వహిందూ పరిషత్

# ఉత్తరాంధ్ర ప్రాంత సమావేశాలు ప్రారంభం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత రెండు రోజుల సమావేశంలు, విశాఖపట్నం, విశాలాక్షి నగర్ లోని %దీఎఖ% జూనియర్ కళాశాల లో తేది 8, జనవరి, 2022 ప్రారంభించబడింది. ఈ కార్యక్రమం లో శ్రీ సాయి దత్త లోకేశ్వరానంద స్వామీజీ మరియు విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత అధికారుల ద్వీప ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. పరిషత్ ప్రాంత అధ్యక్షులు శ్రీవెంకటేశ్వర్లు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడుతూ జునాగడ్, గుజరాత్ లో జరిగిన అఖిల భారత సమావేశాల ముఖ్య అంశాలను పరిషత్ కార్యకర్తలకు వివరించారు.మనం బలపడితే సహజంగా శత్రువు బలహీనుడు అవుతాడు, అందుచేత హిందూ సమాజాన్ని వ్యవస్థీకృతం చేయాలని ఆయన అన్నారు. మూడవ సహస్రాబ్దిలో ఆసియా ఖండాన్ని క్రైస్తవీకరణ చేస్తామని, పోప్ ఇచ్చిన పిలుపును వెనక్కి తీసుకోవాలని, ఇంతకాలం జరిగిన హింసకు వారు క్షమాపణలు చెప్పాలని, సర్వధర్మ సమభావనను వారు అంగీకరించాలని, హిందూ వ్యతిరేక సాహిత్యాన్ని ఇకపై ప్రచురించమని వారు వాగ్దానం చేయాలని జునాగఢ్ సమావేశము కోరిందని ఆయన పరిషత్ కార్యకర్తలకు తెలియజేశారు. మతం మారిన వారు మోసపూరితంగా పొందే రిజర్వేషన్లు మరియు ఇతర రాయితీలు రద్దు చేయాలని మరొక తీర్మానం లో జునాగఢ్ సమావేశం డిమాండ్ చేసిందని తెలిపారు.

ఉత్తరాంధ్ర ప్రాంత కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ఇతర మతాలకు చెందిన వారు హిందూ దేవాలయాలకు సంబంధించిన ఆస్థులలో దుకాణాలు పెట్టుకోవడాన్ని నిషేధిస్తూ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు ఇప్పుడు స్టే ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను ప్రక్కన పెట్టి ఈ తాత్కాలిక ఉత్తర్వును సుప్రీంకోర్టు ఇచ్చింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులు పట్ల విశ్వ హిందూ పరిషత్ చాలా ఆశ్చార్యాన్ని, బాధను, అభ్యంతరాన్ని వ్యక్తంచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాలయాలను మాత్రమే తన ఆధీనంలో ఉంచుకుని చర్చిలు, మసీదుల యొక్క నిర్వహణా స్వేచ్ఛ ఆ మతాలవారికే వదిలేసింది. కొన్ని దశాబ్దాలుగా హిందూ దేవాలయాల నిర్వాహణ నుంచి ప్రభుత్వం తప్పుకుని వాటిని హిందూ సమాజానికి అప్పగించాలన్న డిమాండ్ హిందూ సమాజం చేస్తూనే ఉంది. అంతే కాకుండా చాలా విచిత్రమయిన విషయం ఏంటంటే ప్రభుత్వం హిందూ దేవాలయాల పాలకమండల్లలో, దేవదాయ ధర్మాదాయ శాఖలో, ఉద్యోగాలలో అన్యమతస్థులను అధిక సంఖ్యలో నియమించింది. దీనివల్ల హిందూ దేవీదేవతల పట్ల విశ్వాసం లేనివారు, హిందూ ధర్మంపట్ల ద్వేష భావం కలవారు దేవాలయ నిర్వహణలో పాతుకుపోయారు. దీనివల్ల దేవాలయ వ్యవస్థ యొక్క పవిత్రత దెబ్బతింటోంది. ఈ దురాగతాలు, దుర్మార్గాలు చాలదన్నట్లు దేవాలయ దుకాణాల సముదాయలలో కూడా అన్యమతస్థులు దుకాణాలు నిర్వహించుకోవచ్చు అనే తీర్పు చాలా బాధాకరమైనది. ఈ నిర్ణయం హిందూ సమాజ మనోభావాలను, విశ్వాసాలను తీవ్రంగా గాయపరుస్తున్నది. విగ్రహారాధనను, బహుదేవతారాధనను వ్యతిరేకించే వాళ్ళకు హిందూ దేవాలయాలలో దుకాణాలు కేటాయించడం సరైన నిర్ణయం కాదు. సుప్రీంకోర్టు ఈ తీర్పుపై పునరాలోచన చేసి వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, హిందువుల మనోభావాలను మరియు విశ్వాసాలను గౌరవించాలని విశ్వ హిందూ పరిషత్ కోరుతోంది. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా హిందూ సమాజం పెద్దఎత్తున నిరసన ఉద్యమాలు చేస్తుందని విశ్వ హిందూ పరిషత్ తెలియజేస్తోంది. అఖిలభారత కార్యకారిణి వై. రాఘవులు, ప్రాంత సహకార దర్శి గాంధ్రేగుల సుబ్రహ్మణ్యం, విశాఖ మహా నగర్ అధ్యక్షులు కందరపు విశ్వనాథం, ప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ప్రాంత సంఘటన సహాయ కార్యదర్శి శివ శంకర్, రాష్ట్ర కోశాధికారి మట్టపల్లి విశ్వేశ్వరరావు మరియు 80 మంది ప్రాంత పదాధికారులు పాల్గొన్నారు.



పరమాన్నం వండుతున్న ఆచార్యులు

# స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ ఏర్పాటు చేస్తాం

## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




శిక్షణ తరగతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ (విజయభాను న్యూస్) : ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌ను స్కూల్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌గా మార్పు చేస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఏయూ భౌతిక శాస్త్ర విభాగ సమావేశ మందిరంలో సేఫ్టీ అండ్ డిజాస్టర్‌మేనేజ్‌మెంట్‌పై ఆరునెలల డిప్లమో కోర్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రక్షణ రంగ ఉద్యోగులు విభిన్న కోర్సులను అందిస్తూ సమర్ధవంతంగా పనిచేసే వేదికగా స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ నిలుస్తుందన్నారు. రక్షణ రంగాలలో పనచేస్తూ, సూదీర్ఘ అనుభవం కలిగిన వ్యక్తులు ఇక్కడ బోధన చేస్తారన్నారు. రక్షణ రంగాలకు ఉపయుక్తంగా నిలచే పరిశోధనలు జరిపే కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతామన్నారు. రక్షణ రంగాల ఉద్యోగులు తమ సామర్థ్యాలు, నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచించారు. పదవీ విరమణ తరువాత నూతన జీవితాన్ని ప్రారంభించడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు.

సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ సంచాలకులు ఆచార్య కె.నిరంజన్ కేంద్రం నుంచి అందించే విభిన్న కోర్సులు వివరాలు వెల్లడించారు. అకడమిక్ అడ్వయిజర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, జిల్లా సైనిక్ బోర్డ్ ఉపాధ్యక్షులు కల్నన్ ఎస్.ఎం భాషా, ఆచార్య ఎన్.ఏ.డి పాల్, డాక్టర్ చల్లా రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రాసదరెడ్డిని నిర్వాహకులు సత్కరించారు.

# అరకు ఎంపీ మాధవి ఇంట్లో విషాదం



సుర్ల పంతులమ్మ

కొయ్యూరు (విజయభాను న్యూస్) : రకు ఎంపి గొడ్డేటి మాధవి ఇంట్లో విషాదం నెలకొంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపి మాధవి అమ్మమ్మ సుర్ల పంతులమ్మ మృతి చెందారు. కొయ్యూరు మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో ఉంటున్న ఆమె పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం జరిగే అంత్యక్రియల్లో ఎంపి పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : విశాఖలో జరిగిన ఆటల పోటీల్లో మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శు క్రవారం విశాఖ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆట్యా పాట్యా బాలుర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులైన ప్రసాద్, ఆనంద్, అనిల్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పేరెంట్‌సన కమిటీ చైర్మన్ మంగరాజు, హెచ్ఎం అచ్యుతరామయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాదరావు అభినందించారు.

# అవగాహన కార్యక్రమం

భీమునిపట్నం ( విజయభాను న్యూస్) : జివిఎంసి జోన్ ఒన్ భీమిలి పరిధి లో స్వచ్ఛ సర్వే క్షణ 2022 లో భాగంగా కమీషనర్ ఎస్. వెంకట రమణ ఆదేశాల ప్రకారం అన్ని వార్డులలో పరిసరాల పరిశుభ్రత ఇంటి ఇంటి నుండి చెత్తలను తడి పొడి మరియు ప్రమాదకరమైన వ్యర్ధములుగా వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి అందించుటకు గాను మరియు ఇంటి వద్దనే సెంద్రీయ ఎరువు తయారు చేయుటకు గాను ఒక సారి వినియోగించి పడేసి ప్లాస్టిక్ నిషేదం కొరకు యూజర్ చార్జీలు సకాలములో చెల్లించాలని పలు అంశాలపై అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు అలాగే మూడవ వార్డ్ లో బీచ్ రోడ్ లో లైట్ హౌస్ వద్ద మానవహారం స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వ హించారు. అలాగే స్థానిక నెహ్రూ స్కూల్ లో విద్యార్థులకు స్వచ్ఛ సర్వెక్షణ 2022 పై అవగాహనా మరియు వ్యాసరచన పోటీ నిర్వహించారు.

# ఫైనల్ పోరులో జుబేర్ న్యూకాలనీ, ఎస్‌విఎల్‌ఎన్ టీంలు


**- నేటి తుదిపోరుకు ముస్తాబైన పోర్టు స్టేడియం**

**- ప్రధాన ఆకర్షణగా ఫైనల్ బొనాంజా (బ్రాండ్ అంబాసిడర్ల ఎంపిక)**



సెమీ ఫైనల్ లో బౌలింగ్ చేసి మ్యాచ్ ను ప్రారంభిస్తున్న సిఎంఆర్ గ్రూప్ అధినేత, ప్రగతి భారతి చారిటబుల్ ట్రస్ట్ మెంబర్ మావూరి వెంకట రమణ..

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రతిష్టాత్మక వైఎస్ ఆర్ కప్ మెగా క్రికెట్ టోర్నమెంట్ 2021 శనివారం జరిగిన సేమీఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించి ఆదివారం పోర్టు స్టేడియంలో జరగనున్న టైటిల్ పోరుకు బుబేర్ న్యూకాలనీ జట్టు (42/1) మరియు ఎస్ వి ఎల్ ఎన్ (89/3) అర్హత సాధించాయి. గత నెల 21న ముఖ్యంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం పురష్కరంచుకొని విశాఖపట్నంలో రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి ఆద్వర్యంలో వైఎస్ ఆర్ కప్ పేరుతో మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. డిశంబర్ 22 వ తేదీనుండి జనవరి 8 వ తేదీవరకు మెదటి దశతో పాటు, పూల్ పూనల్ దశ, ప్రీక్వార్టర్ ఫైనల్ దశ, క్వార్టర్ ఫైనల్ దశ, సమీఫైనల్ దశ విజయవంతంగా ముగిసాయి. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు జరుగు గ్రాండ్ ఫినాలేలో తపపడడానికి జుబేన్ న్యూకాలేనీ జట్టు, ఎస్ వి ఎల్ ఎన్ జట్టు సిద్ధమవుతున్నాయి. శనివారం పోర్ట్ స్టేడియంలో జరిగిన సెమీఫైనల్లో మొదటి మ్యాచ్ లో అశోక్ వారియర్స్ మరియు ఎస్ వి ఎల్ ఎన్ టీమ్ లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఎస్ వి ఎల్ ఎన్ టీం బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన అశోక్ వారియర్స్ జట్టు నిర్ణీత 10 ఓబర్లలో 8 వికెట్లు నష్టానికి 84 పరుగులు చేసింది. ఆనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్ వి ఎల్.ఎన్ టీమ్ 7.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజయం సొంతం చేసుకుంది. ఎస్ వి ఎల్ ఎన్ ఆటగాడు ఎం సాయి 9 బంతుల్లో 23 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్ చేసి 2 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. విజయం సాదించిన ఎస్ వి ఎల్.ఎన్ టీమ్ ఫైనల్ చేరుకుంది.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి, ప్రగతి భారత్ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ ఎస్ ఆర్ గోపినాథ్ రెడ్డి, మ్యాచ్ ప్రారంభించగా ప్రగతి భారత్ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ మావూరి వెంకట రమణ టాస్ వేశారు.అనంతరం రెండవ మ్యాచ్ లో శ్రీ పెంటమాంబ మరియు జుబేర్ న్యూకాలని టీమ్ లు తలపడ్డాయి. టాస్ గెలిగి జుబేర్



సెమి ఫైనల్ బ్యాటింగ్ చేసి మ్యాచ్ ను ప్రారంభిస్తున్న ప్రగతి భారతి ఫౌండేషన్ మెంబర్, ఎస్.ఆర్ షాపింగ్ మాల్ అధినేత, ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి, వికెట్ కీపింగ్ చేస్తున్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు.

న్యూకాలని జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీ పెంటమాంబ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 97 పరుగులు సాధించింది. 98 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జుబేర్ న్యూకాలని జట్టు 8.1 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. జుబేర్ న్యూకాలని ఆటగాడు బొర్రా హేమంత్ 24 బంతుల్లో 7 సిక్స్ లు 1 ఫర్ సహాయంతో 63 పరుగులు సాదించి అజేయంగా నిలవడమే కాక 21 పరుగులు ఇచ్చి 2 వికెట్లు పడగొట్టి అద్భుతమైన ఆలౌరౌండ్ ప్రదర్శన ఇచ్చినందుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. సెమీఫైనల్ లో విజయం సాధించిన ఎస్ వి ఎల్ ఎన్ టీమ్ మరియు జుబేర్ న్యూకాలని టీమ్ లు ఫైనల్ కు చేరుకున్నాయి.. ఫైనల్ కి చేరుకున్న రెండు టీమ్ ల మధ్య ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. మరోవైపు మూడవ స్థానం కోసం సెమీ ఫైనల్లో ఓటమి చెందిన అశోక్ వారియర్స్ మరియు శ్రీపెంటమాంబ టీమ్ లు ఉదయం 9 గంటలకు తలపడతాయి. 490 టీంలు, 500 మ్యాచ్ లు , 7840 క్రీడాకారులులో క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద టోర్నమెంట్ గా గుర్తింపు పొందిన వైఎస్ ఆర్ కప్ -2021 మెగా టోర్నమెంట్ ఆంధ్ర యూనివర్శిటీ సాంకేతిక సహకారంలో విజయవంతంగా తుదిదశకు చేరుకుంది. జివిఎంసి డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ఉత్తర నియోజక వర్గ సమన్వయ కర్త, నెడ్ క్యాప్ చైర్మెన్ కేకే రాజు, కార్పొరేటర్లు కతారి అనిల్ కుమార్ రాజు, ఆళ్ళ లీలావతి, పివి సురేష్, బిపిన్ కుమార్ జైన్, జివిఎంసి కోప్సన్ మెంబర్ బేహరా బాస్కర్, వైకాపా నేత చొక్కాకుల వెంకటరావు, మహిళా నాయకురాలు పేడాడ రమణ కుమారి, నిర్వాహక బృందం సబ్యులు విజయ్ మోహన్, పల్లవి, జేమ్స్ స్టీఫెన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



*వై ఎస్ ఆర్ కప్ 2021లో శనివారం నాడు పోర్ట్ స్టేడియంలో జరిగిన సెమీఫైనల్లో మొదటి మ్యాచ్ లో తలపడ్డ అశోక్ వారియర్స్ మరియు ఎస్ వి ఎల్ ఎన్ టీమ్ లు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఎస్ వి ఎల్ ఎన్ టీమ్. మొదట బ్యాటింగ్ చేసిన అశోక్ వారియర్స్ జట్టు నిర్ణీత 10 ఓబర్లలో 8 వికెట్లు నష్టానికి 84 పరుగులు చేసింది. ఆనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్ వి ఎల్.ఎన్ టీమ్ 7.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి విజయం సొంతం చేసుకుంది. ఎస్ వి ఎల్ ఎన్ ఆటగాడు ఎం సాయి 9 బంతుల్లో 23 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్ చేసి 2 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. విజయం సాదించిన ఎస్ వి ఎల్.ఎన్ టీమ్ ఫైనల్ చేరుకుంది.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి, ప్రగతి భారత్ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ ఎస్ ఆర్ గోపినాథ్ రెడ్డి, మ్యాచ్ ప్రారంభించగా ప్రగతి భారత్ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ మావూరి వెంకట రమణ టాస్ వేశారు.*

## ప్రధాన ఆకర్షణగా ఫైనల్ బొనాంజా

ముందుగా పకటించిన విదంగా ఇప్పటికే 490 టీంల క్రీడాకారులకు టోకెన్లు పంపినీ చేయడం జరిగిందని నిర్వాహక బృందం సభ్యులు జేమ్స్ స్టీఫెన్ తెలిపారు.ఆదివారం జరుగు ఫైనల్ పోరుకు టోకెన్లు అందుకున్న క్రీడాకారులందరూ క్రికెట్ డ్రస్ లోరావాలని కోరారు. క్రీడాకారులు తమ వద్ద ఉన్న ఒక టోకెన్ ను వలంటీర్ కు అందించాలని మిగిలిన టోకెన్ లక్కీడ్రాలో గెలుపొందిన తరువాత నిర్వాహకులకు అందించాలని అన్నారు. ప్రతి పూల్ నుంచి ఇద్దరిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, లక్కీడిప్ విజేతలకు రూ 25 వేల నగదు బహుమతితో పాటు, వచ్చే సీజన్ కు బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తించడం జరుగుతుందని అన్నారు.

## అహ్లాదాన్ని అందించిన ఎగ్జిబిషన్ మ్యాచ్

*సెమీఫైనల్ రోజున నిర్దేశిత మ్యాచ్ లు ముగిసిన అనంతరం గుడివాడ అమర్ నాథ్ 11, కేకే రాజు 11 జట్ల ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్ నాథ్, ఉత్తర నియోజ వర్గ ఇన్చార్జ్, నెడ్ క్యాప్ చైర్మెన్ కేకే రాజు చెరోటీంకు కెప్లెన్లుగా వ్యవహరించారు. సరదాగా సాగిన మ్యాచ్ లో గాజువాక నియోజక వర్గ ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు పివి సురేష్, బిపిన్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.*

## వైఎస్ ఆర్ కప్ టోర్నమెంట్ కు అనూహ్య స్పందన

**ఏపి క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి ఎస్ఆర్ గోపినాధ్ రెడ్డి**

రాజ్యసభ సభ్యలు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి ఆద్వర్యంలో విశాఖనగరంలో నిర్వహించిన వైఎస్ ఆర్ కప్ 2021 సెకెండ్ సీజన్ కు క్రీడాకారులనుండి, క్రీడాభిమానుల నుండి అనూహ్య స్పందన లభించిందని అంధ్రప్రదేశ్ క్రికెట్ అసోషియేషన్ కోశాదికారి, ప్రగతి భారత్ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ గోపినాథ్ రెడ్డి అన్నారు. శనివారం సెమీఫైనల్ లో జరిగిన మెదటి మ్యాచ్ ప్రగతి భారత్ ఫౌండేషన్ సభ్యుడు మావూరి వెంకట రమణ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ క్రీడలు యువకుల్లో ఆత్మవిశ్వాసాన్ని, క్రీడా స్పూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. వైఎస్ ఆర్ కప్ ప్రతి సంవత్సరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్బంగా విశాఖనగరంలో జరుగుతుందని రాజ్యసభ సభ్యులు ఇప్పటికే ప్రకటించిన విషయం గుర్తు చేసారు. క్రీడాకారులనుండి వస్తున్న స్పందన అనూహ్యమైనదని, మున్ముందు మరింతలా తమ సహకారాన్ని అందిస్తామని అన్నారు. మావురి వెంకట రమణ మాట్లాడుతూ క్రీడలు మానసిన, శారీరక ఆరోగ్యాన్ని అందిండమేకాక క్రమశిక్షణను నేర్పుతాయని అన్నారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు. క్రీడాకారులకు అభినందనలు తెలియజేసారు.



## యున్కెటెడ్ మెడికల్ & హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 7వ మహాసభలు విజయవంతం




ద్వారకానగర్ (విజయభాను న్యూస్) : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలోని పారామెడికల్ ఉద్యోగులు మరియు కాంట్రాక్టు ఉద్యోగుల 7వ రాష్ట్ర మహాసభలు టి.విల్సన్ బాబు నగర్, పబ్లిక్ ల్కెబ్రరి, విశాఖపట్నంలో శనివారం జరిగాయి. ముఖ్యఅతిధిగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎం.ఎల్.సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) ప్రధాన అతిధిగా సిఐటియు రాష్ట్ర కోశాధికారి కామ్రేడ్ ఎ.వి.నాగేశ్వరరావు హాజరై ప్రసంగించారు.

మహాసభలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు ప్రారంభించారు.రాష్ట్ర అధ్యక్షులు తాళ్లూరి వెంకటేశ్వర్లు మహాసభ కు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. జివో 64ను రద్దుచేయాలని, జివో 143ని సమీక్షించాలని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ రంగం లోనే కొనసాగించాలని యున్కెటెడ్ మెడికల్ & హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వైద్య ఆరోగ్యశాఖపై జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులపెత్తనాన్ని పెంచే విధముగా జివో 64 ఉందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. జివో 143 వలన ఎంపిహెచ్ఇఓ, పిహెచ్సి, సిహెచ్ఓ, డిపిఎంఓ వంటి 20 సం?ల అనుభవమున్న 15వందల మంది పారామెడికల్ ఉద్యోగులు సర్ప్లస్గా మారే ప్రమాదం ఉందని అలాగే మరో 2వేల మంది హెల్త్ సూపర్‌వైజర్ ఆడ, మగ, సర్ప్లస్‌గా మారే ప్రమాదం ఉందని సభ అభిప్రాయపడిరది. 11వ పిఆర్‌సి లో రెగ్యులర్ ఉద్యోగులకు అన్యాయం జరిగిందని కరువుభత్యం (డిఏ) బకాయిలు ఇవ్వడం ద్వారా ఉద్యోగులను సంతృప్తిపరచాలని ప్రభుత్వం భావిస్తుందని సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. అలాగే సుమారు 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 30వేల మంది ఎన్.హెచ్.ఎం ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి పిఆర్‌సి వెంటనే అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని మహాసభ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అనంతరం మహాసభ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నిక ఏక గ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శి జగన్మోహన్ వందన సమర్పణతో రాష్ట్ర మహాసభ ముగిసింది.

**నూతన కవిటీ....**

రాష్ట్ర గౌరవాధ్యక్షులు : ఎ.వి.నాగేశ్వరరావు,

రాష్ట్ర అధ్యక్షులు : పలివెల శ్రీనివాసరావు (తూర్పుగోదావరి),

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : తాళ్ళూరి వెంకటేశ్వర్లు (ప్రకాశం),

ఉపాధ్యక్షులు : జి.వి.సోమేశ్వరరావు (శ్రీకాకుళం), కె.జగదాంబ (విజయనగరం), జివిరమణ (కృష్ణాజిల్లా), సందాని భాషా (కర్నూలు), గురుప్రసాద్ (అనంతపురం), వి.మాలతి (కృష్ణాజిల్లా), మాలతీ చందూర్ (శ్రీకాకుళం), శెట్టి నాగరాజు (విశాఖ),

రాష్ట్ర కార్యదర్శులు : పి.అప్పారావు (శ్రీకాకుళం), కె.జగన్మోహన్ రావు (విశాఖ), సావిత్రి, డి.ఎ.రత్నరాజు, కె.చిన్నారి, కలీముల్లా, జప్రుల్లా, గురవయ్య

కోశాధికారి : చుక్కల సత్యన్నారాయణలతో పాటు మరో 30 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## ఘనంగా భారత్ నంది అవార్డుల ప్రదానం

**- విశిష్ట సేవలకు గుర్తింపు - సంక్రాంతి అంటేనే సాంప్రదాయాల సంబరం**




మద్దిలపాలెం(విజయభాను న్యూస్): సంక్రాంతి పర్వదినం అంటేనే సాంప్రదాయాల సంబరమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక కళాభారతిలో భారత్ నంది పురస్కారాలు, శివనంది పురస్కారాలు ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్లలు సంయుక్తంగా నిర్వహించిన నంది పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవ్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ గ్రామీణ ప్రాంతాలకు పెట్టింది పేరుగా అభివర్ణించారు. మన దేశంలో రైతాంగం ఎంతో సంతోషంగా జరుపుకునే అతి పెద్ద అభివర్ణించారు. సంక్రాంతి సంబరాలను సదరు సంస్థలు ముందుగా నిర్వహించడం, పండగ నేప థ్యంలో పలువురు విశిష్ట సేవలను గుర్తించి నంది పురస్కారాలను అందజేయడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా బుల్లితెర నటి మేఘన, సినీ నటుడు కృష్ణతేజ, వేణు శ్రావణ్, సింహాచలం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు, జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, రాజా ఇన్ఫ్రా అధినేత రాజా, మెసెస్ ఆంధ్రప్రదేశ్ డి. సునీత, ఏపీ ప్రిన్సెస్ సంధ్యారాణి, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హెచ్.రమణమూర్తి, నాట్య కళాసమితి గురువు అరుణాసాయి, కూచిపూడి ఫౌండర్ డైరెక్టర్ పి.వెంకటరమణ, ఇతర నటులు రాజేశ్వరి, కస్తూరి అలివేణి, తులసిశ్రీదేవి తదితరులకు పురస్కారాలను అందజేశారు. ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు వీరిని పురస్కారాలను సత్కరించడం జరిగిందని నిర్వాహకులు రమణరావు, లలితలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ రాజధాని ఢిల్లీలో కూడా అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఉదయం నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువులతో పలువురు అతిథులను సత్కరించారు. సినీనటుడు ప్రసన్నకుమార్, ఎనుజే ఉపాధ్యక్షుడు ఎన్. నాగేశ్వరరావు, సర్వేష్, నాయన ప్రదాన్, మనభంజన్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ శారదాపీఠాన్ని సందర్శించిన గిరిజనులు

- మహిళలు సౌభాగ్యంగా కనిపించేది హిందూ ధర్మంలో మాత్రమే
- అన్యమతస్తులకు ఆకర్షణ కావద్దు
- గిరిజన ప్రాంతాల్లో హిందూ ధర్మాన్ని కాపాడండి
- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు





పెందుర్తి (విజయభాను న్యూస్) : హిందూ ధర్మాన్ని అనుసరించే మహిళల కట్టు, బొట్టు భారతీయ తను ప్రతిబింబి స్తాయని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి అన్నారు. పసుపు కుంకుమలతో మహిళలు సౌభాగ్యంగా కనిపించేది కేవలం హిందూ ధర్మంలో మాత్రమేనని స్పష్టం చేశారు. అరకు, పాడేరు ప్రాంతాల నుంచి శనివారం విశాఖ శ్రీ శారదాపీఠానికి గిరిజనులు వచ్చారు. ఆనవాయితీ ప్రకారం తమ తొలిపంటలో కొంతభాగాన్ని సింహాద్రి అప్పన్నకు సమర్పించేందుకు గిరిజనులంతా విశాఖ వచ్చారు. అప్పన్న దర్శనానికి వెళ్లే ముందు విశాఖ శ్రీ శారదా పీఠానికి చేరుకున్నారు.

రాజశ్యా మల అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా గిరిజనులతో స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి మాట్లాడారు.

ఇతర మతాల వలలో పడొద్దని హితవు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో హిందూ ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. గ్రామ దేవతలను ఆరాధించాలన్నారు. ఆదివాసీలకు అప్పన్న ఆశీస్సులు, రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు.

# గిరిజన ప్రాంతాలు ధర్మానికి పట్టుగొమ్మలు

- నిస్వార్థమైన భక్తి ఆదివాసీల్లో కనిపిస్తుంది
- పంటల్లో కొంత భాగాన్ని దేవునికి సమర్పించాలన్న గిరిజనుల తపన ఆదర్శనీయం
- విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారు





సింహాచలం (విజయభాను న్యూస్) : గిరిజన ప్రాంతాలు హిందూ ధర్మానికి పట్టుగొమ్మలని విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. నిస్వార్థమైన భక్తి ఆదివాసీల్లో కనిపిస్తుందని తెలిపారు. అరకు, పాడేరు ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన గిరిజనులతో కలిసి శనివారం సింహాచలం అప్పన్నను స్వామీజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వాత్మానందేంద్ర స్వామి మాట్లాడుతూ విశాఖ ఏజెన్సీలో ఆదివాసీలు తాము పండించిన పంటలో కొంత భాగాన్ని వైకుంఠ ఏకాదశికి ముందు సింహాద్రి అప్పన్నకు సమర్పించే సాంప్రదాయం అపూర్వమైనదని అన్నారు. ఈ కార్యక్రమం కోసం గిరిజనులు కాలినడకన సింహాచలం చేరుకోవడం వారి భక్త ప్రవత్తులకు నిదర్శనమని చెప్పారు. చేతికందిన పంటల్లో కొంత భాగాన్ని దేవునికి సమర్పించాలన్న గిరిజనుల తపన ఆదర్శనీయమని అన్నారు. గిరిజనుల హరి నామ స్మరణతో సింహగిరులు మార్మోగడం ఆనందం కలిగించిందని అన్నారు. గిరిజనులకు చేసే సేవను విశాఖ శ్రీ శారదాపీఠం భగవంతుని సేవగా భావిస్తుందని స్పష్టం చేశారు. గురువులు స్వరూపానందేంద్రస్వామి ఆదేశాల మేరకు ఇటీవల విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ అటవీ ప్రాంతాల్లో ఇటీవల రగ్గులు పంపిణీ చేశామని వివరించారు. సుదూర ప్రాంతం నుంచి అప్పన్నను దర్శించుకోవడానికి వచ్చిన గిరిజనుల కోసం సింహాచలం దేవస్థానం చేసిన ఏర్పాట్లను స్వాత్మానందేంద్ర స్వామి అభినందించారు.





# వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు

ద్వారకానగర్ (విజయభాను న్యూస్) : వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణం చేసిన ప్రయాణికులపై కొరడా ఝుళిపించింది. డిసెంబర్ నెలలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ప్రయాణికుల నుంచి జరిమానా రూపంలో రూ. 2 కోట్ల 5 వేలు వసూలు చేసింది. 35 వేల 342 మందిపై కేసులు నమోదు చేసింది.

# పోర్ట్ స్టేడియం గేట్ ముందు బీటీ రోడ్డు మరమ్మతులు చేయించిన కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : గ్రేటర్ విశాఖ 14వ వార్డులో పోర్ట్ స్టేడియం గేటు ముందున్న బీటీ రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్న విషయాన్ని,14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త నెడ్క్యాప్ చైర్మన్ కె కె రాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కేకే రాజు నగర పర్యటనలో ఉన్న రాజ్యసభ సభ్యులు విజయ సాయిరెడ్డి దృష్టికి, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి బీటీ రోడ్డు మరమ్మత్తులు కొరకు నాలుగు లక్షలు మంజూరు చేయించడం జరిగింది.శనివారం వార్డు కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు దగ్గరుండి బీటీ రోడ్డు మరమ్మతులు చేయించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏ.ఈ శ్రీనివాస్, వర్క్స్ ఇన్స్పెక్టర్ అనిల్, వసంతల అప్పారావు పాల్గొన్నారు.

# 500 ఎకరాల్లో 'అంతర్జాతీయ మెగా లెదర్ పార్క్'

### 500 ఎకరాల్లో ఏర్పాటు.. 10 వేల మందికి ఉపాధి

### లిడ్‌క్యాప్ చైర్మన్ రాజశేఖర్ వెల్లడి



అమరావతి: ప్రకాశం జిల్లాలో 500 ఎకరాల్లో 'అంతర్జాతీయ మెగా లెదర్ పార్క్'ను ఏర్పాటు చేయనున్నామని, దీనివల్ల 10 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించేలా ప్రతిపాదన చేశామని చర్మ పరిశ్రమ అభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్) చైర్మన్ కాకుమాను రాజశేఖర్ ప్రకటించారు. తాడేపల్లిలోని లిడ్‌క్యాప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత చంద్రబాబు ప్రభుత్వం మాదిగలకు రూ. 100 కోట్లు కేటాయించి, రూ. 40 కోట్లు విడుదల చేసి తిరిగి వాటిలో రూ. 25 కోట్లు వెనక్కి తీసుకుని, చివరకు రూ.10 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, డీపీఆర్‌ల పేరుతో మరో రూ. 5 కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అన్ని జిల్లాల్లో పర్యటించి లిడ్‌క్యాప్, మాదిగ సామాజిక వర్గం స్థితిగతులను పరిశీలించి నివేదిక రూపొందించామని, ఆ నివేదికను త్వరలో సీఎంకు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రకాశం జిల్లా ఎడవల్లి, కృష్ణా జిల్లా జి.కొండూరు, చిత్తూరు జిల్లా తిరుపతి, విజయనగరం జిల్లా అడ్డపూసలలో మినీ లెదర్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం కేంద్రం రూ. 20.58 కోట్లు విడుదల చేసిందన్నారు. చర్మకారులకు శిక్షణ కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు.

లెదర్ ఉత్పత్తుల సరఫరా కాంట్రాక్టులో టర్నోవర్ నిబంధనను రూ. కోటి నుంచి రూ. 25 లక్షలకు కుదించామన్నారు. ప్రభుత్వ సంస్థలకు వివిధ ఉత్పత్తులను సరఫరా చేసే అవకాశం లిడ్‌క్యాప్‌కు ఇవ్వాలని సీఎంను కోరినట్లు తెలిపారు. తిరుపతిలో లిడ్‌క్యాప్ భూములు ఆక్రమణకు గురయ్యాయన్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. లిడ్‌క్యాప్ ఆస్తులు ఆక్రమించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ హెచ్చరించారు.

చంద్రబాబు మెప్పుకోసం ప్రభుత్వ సలహాదారు సజ్జలపై వంగలపూడి అనిత విమర్శలు చేయడం తగదన్నారు.

# కళా హాస్పిటల్ లో కళింగ కార్పొరేషన్ సంక్రాంతి సంబరాలు

- ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్
- తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కళింగ కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు



ద్వారకానగర్ (విజయభాను న్యూస్) : గ్రేటర్ విశాఖ ద్వారకానగర్లో ఉన్న కళా హాస్పిటల్ లో డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో కళింగ కార్పొరేషన్ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కు కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లకు డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి స్వీట్ ప్యాకెట్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తిలక్ మాట్లాడుతూ నూతన సంవత్సరం మొదలుకుని భోగి,సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పర్వదినాలలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కళింగ కులస్తులు అందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కళింగ సంఘం అధ్యక్షులు, కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి మాట్లాడుతూ మన పూర్వీకుల నుండి కళింగ కులస్తులు వ్యవసాయాధారిత వృత్తుల్లో ఉన్న వారం కాబట్టి సంవత్సరాంతంలో జరుపుకునే పండగలలో సంక్రాంతి పండుగకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఆనందంగా సంక్రాంతి పండగలు జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు సనపల రవీంద్ర భరత్, బెందాళం పద్మావతి, రంజిత్ ప్రాపర్టీర్స్ & డెవలపర్స్ అధినేత అన్నెపు రంజిత్ కుమార్, జే.డి.ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత అంపోలు జగదీష్ , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నంబాల రాజేష్ కుమార్,సీనియర్ జర్నలిస్ట్ సనపల చిన్నబాబు, పప్పల లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# టీనేజర్ల టీకాలోనూ ఏపీ టాప్

- నిర్దేశించిన లక్ష్యంలో 72శాతం పూర్తి - రాష్ట్రంలో అత్యధికంగా వైఎస్సార్ జిల్లాలో
- 91.11 శాతం మందికి వ్యాక్సినేషన్

అమరావతి: పిల్లల వ్యాక్సినేషన్‌లో ఏపీ దూకుడు కొనసాగుతోంది. నిర్దేశించిన లక్ష్యంలో శుక్రవారం నాటికి 72 శాతం మందికి వైద్య, ఆరోగ్య శాఖ టీకా ప్రక్రియను పూర్తిచేసి దేశంలోనే తొలిస్థానంలో నిలిచింది. ఇక రాష్ట్రంలో కేవలం 28 శాతం మందికి మాత్రమే టీకా వేయాల్సి ఉంది. దేశంలో ఇప్పటివరకూ 50 శాతానికి పైగా వ్యాక్సినేషన్ పూర్తిచేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ, హిమాచల్‌ప్రదేశ్‌లు మాత్రమే ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో 68.40 శాతం మంది పిల్లలకు టీకా వేశారు. దక్షిణాదితో పాటు, దేశవ్యాప్తంగా ఉన్న ఏ ఒక్క పెద్ద రాష్ట్రంలోనూ 50 శాతానికి మించి టీకా పంపిణీ కాకపోవడం గమనార్హం.

VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com